# నేను, మాజానకి

శ్రీ వేదుల లక్ష్మణమూర్తి

అది పట్నంలో విశాలమైన వీధి ఉదయం ఎనిమిది గంట లౌతుంది. నేను నెమ్మదిగా సైకిలుమీద పోతున్నాను. మెల్లగా వీచే చల్లని గాలికి సైకిలు స్వేచ్ఛగా తెరచాపకట్టిన నావలా నడుస్తోంది. సూర్య రశ్మి వెచ్చగా వీపుకి తగులుతోంది. చల్లని గాలి, వెచ్చని ఎండ మత్తును కలుగజేస్తున్నాయి. కూరగాయల కావిళ్లు, పాలు, పెరుగుగంపలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. అటూ యిటూ దిక్కులు చూస్తూ సైకిలు సాగనిస్తున్నాను. తలవనితలంపుగా సైకిలుకి బ్రేకు వేశాను. హఠాత్తుగా సైకిలు ఆగింది. ఇంతవరకూ పర ధ్యానంగానూ మత్తుగాను ఉన్న కారణంచే ప్రక్కకు వాలిపోయాను. అంతటితో మత్తు వదలిపోయింది. గుండె ఒక్కసారి దడదడలాడింది దిక్కులు చూచే కళ్లు క్రిందకు వాలాయి. ఒక్కసారిగా యేవేవో విషయాలు మనస్సులో గిర్రున తిరిగాయి కళ్లు పైకెత్తడానికి ధైర్యం చాలడంలేదు. సైకిలును క్రిందా మీదా చూచాను. మనస్సు కలవరపడుతోంది. ఆ వీధికి కుడివైపున ఉన్న ఇళ్ళవరుసను చూడగలిగాను. కాని ఎడమవైపు వరుసను, తలవంచి కనుకొలకుల్లోనుంచి చూచాను. సందేహంలేదు. నేను అనుకొన్న వ్యక్తియే. ఇటువైపే చూస్తోంది. ఆమె ఇక్కడ ఉండడానికి కారణ మేమో నాకు బోధపడలేదు. విశాఖపట్నంలో ఉన్నారని ఎప్పుడో విన్నాను. బహుశా ఆమె భర్తకు బదిలీ అయియుండవచ్చు. ఎదుటికి వెళ్ళడమా? వెనక్కి పోవడమా? ఏమీ తోచలేదు. ఒక నిమిషం సైకిల్ని పరీక్షించి, ఇంకో నిమిషం బట్టలు సవరించుకొని సైకిలు ఎక్కాను. కళ్లు మాత్రం ఆ వ్యక్తివైపుకి లేవడంలేదు. మరోవైపుకు ధ్యానంతో చూస్తున్నాను. రోడ్డు చాలా ఖాళీగా ఉంది. రోడ్డు బళ్లూ కార్లూ మొదలైనవాటితో రద్దీగా ఉంటే నాకు కొంత సదుపాయంగా ఉండేది. సైకిలు చురుగ్గా నడుస్తోన్నట్టు తోచింది. ఆ యింటికి మరీ దగ్గరగా వచ్చేశాను. ఎదుటికి వెడితే ఆమెను పలకరించాలి. తరువాత వారి యింట్లోకి వెళ్లాలి. కుశలప్రశ్నలు వెయ్యాలి ప్రస్తుతం నే నున్న బీదస్థితిలో నాకు తగిన గౌరవ మిచ్చి ఆమె మాట్లాడుతుందా? ఆమె భర్తను, ముందుగా నేనే పలుకరించాలేమో! అతన్ని యేమని సంబోధించాలి? వారిద్దర్నీ 'ఏమండీ' అని గౌరవించాలేమో!—అటు చూడకుండా నే ఆ యింటి యెదుటికి వచ్చేశాను. ఆమె పిలవకుండా ఉంటే బ్రతికి పోతాను—అని మనస్సు కోరుతోంది. సైకిలు నెమ్మదిగా దొర్లిపోతోంది. ఇల్లు దాటేశాను. ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాను. శరీరానికి బిగియగట్టిన త్రాళ్లు విప్పినటైంది. గాఢంగా గాలిని పీలుస్తూ సైకిలు పెడలు గట్టిగా క్రిందికి తొక్కుతున్నాను. ఇంతలో 'ఏమండోయ్! అనే పిలుపు వీపుమీద చరచినట్లు వినిపించింది. సైకిలుబ్రేకు నొక్కి వెనక్కి తిరిగి చూచాను. పది పన్నెండేళ్ల కుర్రాడు నా దగ్గరకు పరుగెత్తుకొని వస్తున్నాడు. సైకిలు దిగక తప్పిందికాదు. వాడు నా దగ్గరకు వచ్చి 'అమ్మగారు పిలుస్తున్నారండి' అన్నాడు. అటు చూచాను. ఆమె అక్కడనే నిలబడి ఉంది. సైకిలు మళ్ళించి వాని వెనకనే వెళ్లాను. ఆమె లోపలికి వెళ్ళింది. సైకిలు అరుగునకు జేరపెట్టి మెట్లు ఎక్కాను. ఆమె గుమ్మంలోపల నిలబడి 'ఏం రామం, మమ్మల్ని మరచిపోయావా?' అంది. ఒకసారి ఆమె ముఖం చూచాను. శాంతంగానూ, గంభీరంగానూ ఉంది. నవ్వుగాని, విచారంగాని ఆ ముఖంలో లేవు. 'అబ్బే! మరచిపోతానా? ఇక్కడున్నారేమిటి? మీ ఆయనకు ట్రాన్స్‌ఫరైందా? అని ప్రశ్నించాను. 'ఔను, ఒక నెలైంది ఇక్కడికి వచ్చి. రా, లోపలికి' అంటూ లోపలికి నడిచింది. వీధివైపు వున్నది చిన్న పెంకుటి వసారా. అది దాటి ఆధునిక పద్ధతుల్లో కట్టబడిన డాబాలోకి ఆమెవెనుక నే నడిచాను. డాబా చాలా శుచిగానూ ఆకర్షణీయంగాను ఉంది.

హాలులో ఒక రౌండ్ టేబిలు చుట్టూ నాలుగు కుర్చీలు ఉన్నాయి. నన్ను కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లింది. నేను హాలులో నలువైపులా చూచాను. ఆడంబరమేమీ లేదు. గోడలు తెల్లగా మెరుస్తున్నాయి వీధి గుమ్మానికి ఎదురుగా గోడమీద గడియారం, రెండు కేలండర్లు, హాల్లో ఒకమూల రేడియో ఉన్నాయి. రెండునిమిషాల్లో ఆమె వచ్చి కాఫీతో వున్న కప్పు ఎదుట పెట్టింది. 'ఇప్పుడు ఎక్కడ వుంటున్నావ్?' అని ప్రశ్నించింది. నాకు తాగుతూన్న కాఫీ పలకమారింది. కప్పు బల్లమీద పెడుతూ దగ్గి గొంతుక సవరించుకొన్నాను. 'ఇక్కడే, టౌన్‌లో' అన్నాను. 'ఏంచేస్తున్నావ్?' అని అడిగింది. రెండు గుక్కలు కాఫీ మింగి ఒక క్షణం ఆలస్యంచేసి అన్నాను— 'షావుకారుదగ్గర గుమాస్తా' 'మకాం ఎక్కడ?' 'హోటల్లో'; 'మామయ్యగారి జాడ ఏమైనా తెలిసిందా?' మా నాన్నగారు ఆమెకు మామయ్య. 'లేదు' అని జవాబిచ్చాను.

ఇంతలో కాలిబూటు చప్పుడు వినిపించి అటు చూచాను. వస్తూనే 'ఏమోయ్! ఎక్కడనుంచిరాక?' అని అతనే నన్ను పలుకరించాడు. 'ఇక్కడే టౌన్‌లో ఉంటున్నాను' అని జవాబిచ్చాను. 'ఆఁ! అలాగా! నువ్వు ఇక్కడ ఉంటూన్నట్లు మాకు తెలియనే తెలియదు!' కొంచెం ఆశ్చర్యాన్ని వెల్లడిస్తూ నాకు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. 'నాకూ తెలియదు—మీరు ఇక్కడ వుంటున్నట్టు...' ఇంతవరకూ హాలులో లోపలిగుమ్మాన్ని ఆనుకొని నిలబడి వున్న జానకి—'నేను కూరలకావిడిచూడ్డానికి అరుగుమీదికి వెడితే ఇతను సైకిలుమీద వెడుతూ కనుపించాడు. మన నాయుడు పరుగెత్తుకొని వెళ్లి తీసుకొచ్చాడు. ఇక్కడే షావుకారుదగ్గర గుమస్తాపని చేస్తున్నాట్ట. మకాం హోటల్లోనట' అని చెప్పి నాకు శ్రమను తగ్గించింది. ఇంతవరకూ వారు నన్ను చేసిన సంబోధనలతో నాకున్న కలవరం చాలవరకు తగ్గింది. నన్ను వారు సంబోధించినట్లే నేనూ వారిని సంబోధించవచ్చు, అనే ధైర్యం కలిగింది.

'అలాగా, షావుకారు జీతమేమిస్తాడు? అని ప్రశ్నించాడు 'ముప్పై' అన్నాను. 'అరే! ముప్పైలోను ఇరవైయైదు హోటలుకే పోతే మిగిలిన అయిదు రూపాయలతోనూ కాలక్షేప మెలా చేస్తున్నావు?' అన్నాడు ఆశ్చర్యంగా. 'నాకు పైఖర్చు చాలా తక్కువ. అవే సరిపోతున్నాయి' అన్నాను.

'నువ్వు స్కూలుఫైనలు క్లాసు పాసయినట్లున్నావు; వేరె మంచి ఉద్యోగ మెక్కడా దొరకలేదూ?'

'ఇంటర్ కూడా పాసయాను. ఉద్యోగంకోసం తిరిగి తిరిగి ప్రాణం విసిగిపోయింది. చివరికి ఈ షావుకారు దైవంలా దొరికాడు.'

“అరే! ఈపాటికి యేదో డిపార్టుమెంటులో చేర్చేవాణ్ణి నావల్ల కాకపోయినా నన్నెరుగున్న ఆఫీసర్లు చాలామంది ఉన్నారు. వాళ్ళతో చెప్పియుందును.” నేనేమీ జవాబు చెప్పలేదు. ఇంతవరకూ యీ దంపతుల్ని గురించి నాలో కరడుకట్టిన భావాలు మెల్లగా కరగిపోసాగాయి. వీరికి ధనమున్నదనే గర్వం ఉన్నదనీ, ఆ ధనగర్వంతోనూ, అహంభావంతోనూ లేనివారిని నిర్లక్ష్యభావంతో చూస్తారనీ అనుకొనేవాణ్ణి. కాని ఇప్పుడు ప్రత్యక్షంగా వారి నిరాడంబరత వారి మాటల్లోనూ వేషంలోనూ స్పష్టంగా గోచరిస్తోంది. వారికి ఇతరుల కష్టాలయెడల సానుభూతి ఉండదని తలచేవాణ్ణి. కాని ఇప్పుడు నన్నుగురించి వారు వేసే ప్రశ్నలవల్ల నా తలపులు పూర్తిగా నిరాధారమైనవని నా అంతరాత్మ నాకు ప్రబోధిస్తోంది. నా సంకుచిత మనస్తత్వానికి సిగ్గుపడ్డాను.

“ఇప్పుడేమీ మించిపోయింది లేదుగా. రేపు మీరు ఉద్యోగం యిప్పిస్తే యివేళ సాయంకాలం గుమస్తాగిరీకి స్వస్తిచెప్పి రేపు ఉద్యోగంలో చేరతాడు.” అని జానకి నా మనస్సులోని మాటను చెప్పింది.

'ఓ! అలాగే, తప్పకుండా ప్రయత్నంచేద్దాం' అని ఒకక్షణం ఆగి 'నీకు పెళ్ళికాలేదు కదూ?' అని నన్ను ప్రశ్నించాడు.

ఈ ప్రశ్న వానికి చాలా సాధారణమైనది. నా కష్టసుఖాలు తెలుసుకొనే ప్రయత్నంలో ప్రశ్నించి ఉంటాడు. ఆ ప్రశ్న నా మనస్సుమీద యెంతగా పనిచేస్తోందో వానికి తెలియదు. ఈ రోజున వీరిని కలుసుకొనడమే నాకు చాలా బాధాకరమైన విషయం. కాని వీరి సంభాషణా విధానం, నాలో నిరాధారంగా పాతుకొనిపోయిన తప్పుడు భావాల్ని దూరంచేసి నా

మనస్సుకి కొంత ఊరట కలిగించింది. కాని నా పెళ్ళికి సంబంధించిన ప్రశ్న రాగానే నా హృదయంలో మానుతూన్న గాయం రేగింది. ప్రశ్న సద్భావంతో అడిగినదవడంలో సందేహం లేదు. ప్రస్తుతం నేనున్న పరిస్థితిని తెలుసుకోనేందుకు ఈ ప్రశ్న వేయబడిందని అతని ముఖం చూస్తేనే తెలుస్తోంది. ప్రశ్నకు జవాబు చెప్పడం చాలా తేలిక. 'అయింది', 'లేదు' అనే వాటిలో ఒక్కమాట చెబితే చాలు. కాని ఆ ప్రశ్నతో నా మనస్సులో బయలుదేరిన ఆందోళన కారణంగా వెంటనే జవాబు చెప్పలేకపోయాను. ఇంతలో మాకు యెదురుగా గుమ్మంలో నిలుచున్న జానకి — 'లేదు, ఇంకా కాలేదు' అని జవాబుచెప్పి నా మనస్సుకి కొంత బరువు తగ్గించింది. నేను లేచి నిలబడి 'వెళ్ళివస్తాను' అన్నాను.

'ఈపూట మాయింట్లో భోజనం చేసి వెళ్లు' అంది జానకి.

ఆమె మాటతో మాటకలుపుతూ 'నిన్ను ఉద్యోగంలో ప్రవేశపెట్టేవరకూ నీవు మా యింట్లో నే మకాం పెడితే నీ ఉద్యోగాన్ని గురించి నాకు శ్రద్ధ ఉంటుంది. భోజనంచేసి వెళ్లి ఇవాళే హోటలుకి స్వస్తిచెప్పు. నీ పెట్టే బేడా తీసుకొనిరా, అని అంటూ లేచి చొక్కా విప్పుకొన్నాడు.

"అలా చెయ్యి రామం" అంటూ జానకి అతనికీ నాకూ స్నానానికి కావలసిన తువ్వాళ్లు ఎదుట బెట్టింది.

ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో తెలియని అయోమయంలో పడింది నా మనస్సు. ఒక నిమిషం గడిచాక 'ఇప్పుడు కాదు, మళ్లీ వస్తానుగా!' నా ఉద్యోగాన్ని గురించి నేనే జ్ఞాపకం చేస్తూంటాను. తరచూ వస్తూంటాను. ఈ వీధిని బాకీ వసూలు చెయ్యడానికి వచ్చాను. వెంటనే దుకాణానికి పోవాలి అని తొందరగా తడబడుతూ అన్నాను.

"నువ్వు అంతగా మొహమాటపడితే ఎలాగ! మా యింట్లో నువ్వు స్వేచ్ఛగా ఉండొచ్చు. నీకూ నాకూ కూడా మన కష్టసుఖాలు కనిపెట్టే పెద్దవాళ్లెవరూ లేరు. నా తమ్ముడైతే వాని బాధ్యతంతా నేను వహించనూ? నువ్వు పరాయివాడవు కావు. ఈమధ్య జానకి చెప్పగా నిన్ను గురించి విన్నాను" అని శాంతంగానూ గంభీరంగానూ మాట్లాడి నా దగ్గరకు వచ్చి భుజంమీద చెయ్యివేశాడు.

నాకు అప్రయత్నంగా కళ్లు నీళ్లతో నిండాయి. అతన్ని కౌగలించుకొని బావురుమని యేడుద్దామా అనిపించింది. ముఖం ప్రక్కకు తిప్పుకొని దుఃఖాన్ని దిగమ్రింగడానికి ప్రయత్నిస్తున్నాను. అతను జానకిని వివాహం చేసుకోడానికి పూర్వం అతనికీ నాకూ బంధుత్వమేమీ లేదు. వారి వివాహమైన తరువాత అతన్ని కలుసుకొని మాట్లాడ్డం ఇది మూడోసారి. ఈసారి కలుసుకొన్నప్పుడే అతనికీ నాకూ సంభాషణ ఎక్కువగా జరిగింది. అతనితో నాకు స్నేహంకూడా లేదు. ఇంక జానకికి నాకూ బంధుత్వ మేమిటీ అంటే వెంటనే చెప్పలేను ఆమె అమ్మగారి యిల్లు మాయిల్లు చేరి దగ్గరగా ఉన్నాయి. వాళ్ళ నాన్న మాఅమ్మ అన్నదమ్ముల పిల్లలని ఒకటి రెండుసార్లు మావాళ్లెవరో చెప్పారు. ఆమె నాకు జానకి, నేను ఆమెకు రామం. ఆమెకు పెళ్ళికానంతవరకు మేము ఒక్కపూటైనా యెడబాటులేని సహచరులం. నేను వ్యక్తిని, ఆమె నీడ. లేదా ఆమె వ్యక్తి, నేను నీడ. ఆమెకు పెళ్ళి కానంతవరకూ ఒక్కపూటైనా మమ్మల్ని విడదీయగల శక్తి నా తలితండ్రులకు కాని ఆమె తలితండ్రులకు గాని లేకపోయింది. కాని పెళ్లయిన తర్వాత ఆమెను ఆమె భర్తతోపాటు నేడు మూడోసారి చూచాను. ఇంతకుముందు ఆమెకు నాకు జరిగిన రెండు సన్నివేశాలు రెండు మూడు మాటలతోనే ముగిశాయి. నేటి సమావేశంలో వారిద్దరూ నాయెడల ఇంత ప్రేమాభిమానాలు చూపించడానికి కారణమేమో నాకు బోధపడలేదు. జానకిలోకంటె అతని మాటల్లోనూ ప్రవర్తనలోనూ వెనుకటి సమావేశాలలోకంటె ఇప్పుడు చాలా మార్పు కనుపిస్తోంది. నేను అనాథుణ్ణి అయిన తరువాత వానిలో జాలికలిగి యీమార్పు వచ్చిందా అని అనుకోడానికి కూడా అవకాశం లేదు. మా అమ్మ చనిపోయి మా నాన్న విరాగియై నన్ను విడిచి కనుపించకుండా పోయిన తరువాత వారికి నాకు సమావేశం జరిగింది. రెండుమూడు మాటలతో మా పొరుగువాళ్ళ ముఖంచూస్తూ పరోక్షంగా సానుభూతి వెల్లడించారు.

ఏమైనప్పటికీ ఇప్పుడు వారు నాయందు చూపిన ఆదరాభిమానాలు నన్ను తన్మయుణ్ణి చేశాయి.

ఏడెనిమిది సంవత్సరాల క్రిందటి విషయాలన్నీ ఒక్కసారి మనస్సులో గిర్రున తిరిగాయి. లేని దగ్గ తెచ్చుకొని బయటికి వెళ్ళి, ఉమ్మివేశాను, కళ్లు తుడుచుకొన్నాను. లోపలికివచ్చి నీరసంగా కుర్చీలో కూర్చున్నాను.

'స్నానంచేద్దాం, రా!' అని అతను తువ్వాలు తీసుకొన్నాడు. నేనూ మాట్లాడకుండా తువ్వాలు తీసుకొన్నాను. జానకి లోపలికి వెళ్లింది. ఆమె వెనుక నే అతనూ నేనూ స్నానాలగది దగ్గరికి వెళ్ళాం. వేడినీరు తోడి కుళాయిదగ్గర పెట్టి జానకి వెళ్ళింది.

'నువ్వు ముందు కానియ్యి' అని అతను లోపలికి వెళ్లాడు. నేను స్నానంచేసి బట్టలు వేసుకొని హాలులోకి వచ్చాను. అతనుకూడా స్నానం చేసిన తరువాత జానకి వడ్డించగా మేమిద్దరం భోజనం చేశాము. భోజనం చేస్తూ ఉద్యోగాల్ని గురించి అతను యేవేవో చెప్పుకొని వచ్చాడు. అతను చెప్పే మాటలన్నింటికి తలూపుతూ త్వరితంగా భోజనం ముగించాను. అతను చెప్పిన మాటలు చాలా తక్కువగా నా చెవుల్లో ప్రవేశించాయి ఏ యే పదార్థాలు తిన్నానో కూడా తెలియనిస్థితిలో నా భోజనమైంది. జానకి వడ్డించడం నేను తినడం ఎనిమిది సంవత్సరాల తరువాత నేటికి తటస్థించింది. ఆమెకు వివాహం కాకపూర్వం తరచూ టిఫెన్లుచేసి నాకు పెడుతూ ఉండేది. అప్పుడు తిన్న ప్రతిపదార్థం యొక్క రుచి నాకు యిప్పటికీ జ్ఞాపకముంది. కాని ఇవేళ నేనేమి తిన్నానో, వాటిరుచి యేమిటో నాకు తెలియలేదు. భోజనమైన వెంటనే 'వెళ్ళివస్తాను' అన్నాను. 'అలస్యం చెయ్యకు, వెంటనే వచ్చేయ్' అని అతనూ జానకీ కూడా చెప్పారు. నన్ను వీధిగుమ్మం వరకూ సాగనంపారు. వాళ్ళ నౌకరు కుర్రాడు లోపల ఉన్న సైకిలు మళ్ళీ బయట పెట్టాడు. వారుచెప్పిన మాటలకి 'ఊఁ' అని తలూపుతూ సైకిలు ఎక్కాను.

*    *    *

జానకిభర్తకు 'నా' అన్నవాళ్లెవరూ లేరు, ఆమెతప్ప. అందుచే వివాహమైన వెంటనే జానకి తన భర్తతో విశాఖపట్నం వెళ్లిపోయింది. ఆమె వివాహానికి సంబంధం నిర్ణయమయే ఘడియవరకూ ఆమెప్రవర్తన అంతా చదువు, అల్లరి, ఆటపాటలతో నిండి ఉండేది. ఉత్సాహం ముందుపుట్టి, తరువాత ఆమెపుట్టిందా అన్నట్లుగా తీరిక, విశ్రాంతి లేకుండా, దినమంతా కొన్నిఘడియల కాలంలా గడిపేది. ఆమె భాగ్యవంతులబిడ్డ. నేను సామాన్య సంసారులకు జన్మించాను. ఈ ఆర్థిక తారతమ్యంవల్లనే నేను జానకికి, జానకి నాకూ అందకుండా పోయామని ఆమెకు వివాహమైన కొంతకాలానికి నాకు అర్థమైంది. ఆమెకు వేరే వివాహానికి ప్రయత్నాలు ప్రారంభమయాయి అది మొదలు ఆమెలో అద్భుతమైన మార్పు వచ్చింది. ఆటపాటలు, అల్లరి, తగ్గిపోయాయి. చదువుకు స్వస్తిచెప్పింది. ఆమెకూ నాకూ మిడిమిడి జ్ఞానం వచ్చింది మొదలు పగలూ రాత్రీ ఎప్పుడూ విడిచిఉండే వాళ్లం కాము. చదివినా, ఆడినా, పాడినా, అల్లరి చేసినా, అన్నం తిన్నా కలసిచేసే వాళ్లం. కలసి బడికిపోయేవాళ్లం. రాత్రి తొమ్మిదింటి వరకూ వాళ్ల నడవలో చదువుకొనేవాళ్లం. వాళ్ల అమ్మ మా యిద్దరికీ యేదో చిరుతిండి పెట్టేది. మా యిద్దరికీ మంచాలువేసి పక్కలువేసేది. కథలూ గాథలూ చెప్పుకొంటూ పడుండేవాళ్లం. ఇవన్నీ అకస్మాత్తుగా ఆగిపోయాయి. నేను పలుకరిస్తే పరధ్యానంగా ఒకేమాటతో జవాబు చెప్పేది. ఆమె వివాహంతో నా దుర్దినాలు ప్రారంభమయాయి. ఆమె కాపురానికి వెళ్ళిన రెండు మాసాలకు మా అమ్మ గతించడం, మా నాన్న యెవరితోనూ చెప్పకుండా యెక్కడికో వెళ్లిపోవడం, నేను అనాథుణ్ణికావడం తటస్థించింది. అప్పటికి నేనూ జానకీ ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష పాసైయున్నాం. పరీక్షలయిన తరువాత వేసంకల్లో ఆమెకు వివాహమైంది. నాకు వచ్చిన దుస్థితి కారణంగా ఒక సంవత్సరం తీరికగా గడచిపోయింది. నేను ఒక చిన్నయింటికి రెండెకరాల భూమికి అధికారినయాను. ఇంక చదువుగాని పని పాటలుగాని లేవు.

జానకి తలిదండ్రులు ఆమెకు వివాహం కానంత వరకూ నన్ను తమ కుటుంబంలోని వ్యక్తిగా చూచుకొనేవారు. తరువాత వారి ఆదరణ క్రమేణా క్షీణింపసాగింది. మా అమ్మ పోయిన తరువాత రెండు మూడు నెలలు వారియింట్లోనే తింటూ తిరుగుతూండే వాణ్ణి. తిండికి మాత్రమే యింటికి వచ్చేవాణ్ని. అది కూడా ఒక్కొక్క పూట సాధ్యపడేదికాదు. కాఫీహోటలు,

సినీమాహాలు, బజార్లోని దుకాణాలు — ఇవీ, నా కాలక్షేపానికి స్థానాలు. సినేమా చిత్రం యేమిటి అనే విషయం నేనెన్నడూ పరిశీలించేవాణ్ని కాను. ఆట మొదలు పెట్టే సమయం, అంతమయే సమయంతో కూడా నాకు పనిలేదు. ఎప్పుడో వెళ్ళడం, గేటుదగ్గర ముప్పావలా చెల్లించడం, రెండుగంటలో మూడు గంటలో కుర్చీలో కూర్చోడం, తిరిగి పదకొండు, పన్నెండు గంటలకు యింటికి చేరి నడుం వాల్చడం. మా జానకి తల్లిని, తండ్రిని నేను అత్తయ్యా, మామయ్యా అని పిలిచేవాణ్ని. వారు 'ఎక్కడకు వెళ్లావ్? ఏం చేశావ్?' అని అడిగితే వారింటిదగ్గర ఉన్నాను, వీరింటి కెళ్లాను, ఎవడో స్నేహితుని యింటిదగ్గర తిన్నాను, అని యేదో సాకు చెప్పేవాణ్ని. ఎన్నడూ సిగరెట్టు చుట్టా మొదలైన వాటిని తాకికూడా యెరుగనివాణ్ని, నాకు రోజూ అయిదారు పెట్టెల సిగరెట్లు నాకు తెలియకుండా తగలడుతూండేవి. ఆ రోజుల్లో నా దుస్థితికి హృదయపూర్వకంగా విచారించి, నా మంచిచెడ్డలు సదా కనిపెడుతూ, నన్ను మంచి దోవలో పెట్టడానికి తన సర్వశక్తులూ ధారపోసినవాడు 'సూర్యం' ఒక్కడే మా గ్రామంలో ఉండేవాడు. సూర్యంగారిల్లు మా యింటికి దగ్గరగానే ఉంది. తరచుగా జానకి, నేనూ, వాడూ కలసి ఆడుతూ పాడుతూ కాలక్షేపం చేసేవాళ్లం. వాడు మా నాన్నగారికి ప్రియమైన విద్యార్థి. బళ్ళో నే కాకుండా బయటకూడ ఆయన కూడా కూడా తిరుగుతూ ఉండేవాడు. మాతో నే స్కూలుఫైనలు ప్యాసయ్యాడు. కాలేజీలో సీటు దొరకని కారణంచేత ఆ సంవత్సరం ఖాళీగా ఇంటిదగ్గర ఉండిపోయాడు. ఏ నిమిషంలో నేను ఎక్కడ వుంటున్నదీ, ఏమి చేస్తున్నదీ, కనిపెడుతూ, తరచూ నన్ను కలుసుకొంటూ, నాతో తిరుగుతూ నన్ను మంచిమార్గాన్ని పెట్టడానికి యేవేవో బోధించేవాడు. కాఫీ హోటల్లోనూ, కిళ్లీకొట్టులోనూ, ఇంకా యితర పరిచయస్థుల దగ్గర నేను చేసే బాకీలు, నాకు తెలియకుండా తీర్చేసేవాడు. అందుచేత నే నేను అడిగినప్పుడల్లా వారు నాకు అరువు యివ్వడమే గాని నన్ను యెన్నడూ బాకీ అడిగేవారు కారు. వారికి నేను బాకీ ఉన్నాను, దాన్ని తీర్చాలి అనే దృష్టి నాకు చాలా తక్కువగా ఉండేది. మా అమ్మ పోయిన రెండుమూడు నెలలవరకూ నేను మా అత్తయ్యగారింట్లోనే భోజనం చేస్తూవుండేవాణ్ని. వారి ఆదరణ పూర్తిగా తగ్గిపోయిందని తోచగానే వారింటికి వెళ్లడం మానేశాను. అప్పటినుండి సూర్యం, పగలు రాత్రి నేను ఎక్కడవున్నా పట్టి తీసుకొనిపోయి తనతో భోజనం చేయించేవాడు. ఈవిధంగా సంవత్సరం తిరిగింది. కాలేజీలో సీటుకి సూర్యం తనతోపాటు నాచేత కూడా బలవంతముగా అప్లికేషను పెట్టించాడు. వాడేమి ప్రయత్నం చేశాడోగాని మాయిద్దరికీ సీట్లు దొరికాయి. నా పెట్టీబేడా సర్దించి పట్నం తీసుకుపోయాడు. పట్నం వెళ్ళేముందు నాకు నేను చేసిన బాకీలసంగతి జ్ఞప్తికివచ్చింది. సూర్యంతో చెప్పాను. బజారు తీసుకెళ్ళాడు. హోటలు, సిగరెట్లబాకీలు ఐదురూపాయలు మాత్రం ఉన్నాయి. నాకు చాలా ఆశ్చర్యం కలిగి 'ఇంతేనా' అని వారిని ప్రశ్నించాను. 'అంతేనండి, ప్రతీనెలా సూర్యంగారు ఇచ్చేస్తున్నారుగా?' అన్నారు. నేను నివ్వెరపోయి సూర్యంకేసి చూశాను. 'ఆఁ, అంతే' అని అంటూ సూర్యం తన జేబులో నుండి డబ్బుతీసి వారికి ఇచ్చివేశాడు. నేను మాట్లాడకుండా యింటికి వచ్చాను. ఆ సంవత్సరం మా భూములమీద వచ్చిన మక్తాధాన్యం మా మామయ్య వసూలు చేశాడు. ధాన్యం నేను వసూలు చేశానని మాత్రం నాతో చెప్పాడు. వాటిని అమ్మమనిగాని ఉంచమనిగాని ఆయనతో నేనేమీ చెప్పలేదు. ఇన్నాళ్లకు వాటివిషయం జ్ఞప్తికివచ్చింది. తిన్నగా ఆయనదగ్గరకు వెళ్లాను. సూర్యం కూడా నన్ను వెంబడించాడు. మా అమ్మ పోయిన రోజుల్లో మా నాన్న నిశ్చింతగా దొడ్లో మామిడిచెట్టు క్రింద కూర్చునేవాడు. ఆమె కర్మకు సంబంధించిన సమస్త విషయాలూ మా మామయ్య చక్కబెట్టాడు. అందుకై మాకు డబ్బు పెట్టుబడి పెట్టిన సంగతి నే నెరుగుదును. మాకోసం ఆయన ఎంత ఖర్చుచేసిందీ నేను అడగాలేదు ఆయన చెప్పాలేదు. ఆ తరువాత వారియిల్లు మా యింటిని చేరి వున్నప్పటికీ నేను ఆయనకు చాలా అరుదుగా కనుపించేవాణ్ని.

ఇప్పుడింక తప్పనిసరియై ఆయనదగ్గరకు వెళ్ళి ధాన్యం ప్రసంగం తెచ్చాను. ఆయన జమాఖర్చు పుస్తకం విప్పి నాయెదుట బెట్టాడు. దాన్ని చూడగా ఆయన మాకై చేసిన ఖర్చునుండి నాధాన్యంవల్ల వచ్చిన సొమ్ము తీసివేయగా ఏభై రూపాయలు ఆయనకు

నేను బాకీపడ్డాను. సూర్యం నాప్రక్కనే ఉన్నాడు. "నేను మానాన్నగారు ఉన్న రోజుల్లో అప్పుడప్పుడు వెంకన్న మాస్టరుగారి దగ్గర రెండువందల వరకూ వాడుకొన్నాను. అప్పటినుండీ వారికి యివ్వడం తటస్థించలేదు. ఇది వారిబాకీయే గనుక మీకు అభ్యంతరం లేకపోతే యీ యాభై రూపాయలూ నేను చెల్లిస్తాను" అని సూర్యం, మామామయ్యతో ఎక్కువ వినయంగా చెప్పాడు. అందుకు ఆయన 'నీకు ఆయన యందు ఇంతటి భక్తివిశ్వాసాలు ఉండి ఋణం తీరుస్తానంటే నేను వద్దనడం మంచిది కాదు' అన్నాడు. వెంటనే సూర్యం తనజేబునుండి యాభైరూపాయల నోట్లుతీసి ఆయనముందు పెట్టాడు. మా యెదుటనే ఆయన పుస్తకంలో జమ వ్రాసుకొన్నాడు. ఇంతలో మా అత్తయ్య నడవలోకి వచ్చి 'ఏంరా! రాముడూ, కనుపించడం మానేశావు?' అంది. 'ఏమీ లేదు, సూర్యంగారి ఇంటిదగ్గర కాలక్షేపం చేస్తున్నాను అత్తయ్యా!' అన్నాను. 'అలాగా' అని నెమ్మదిగా ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది. తరువాత మేమిద్దరం ఆయనదగ్గర శెలవుతీసుకొని మా యింటికి వెళ్ళాం. 'మానాన్నదగ్గర నువ్వు డబ్బుతీసుకోడం నే నెప్పుడూ చూడనేలేదే! నువ్వు ఆయనకి బాకీపడ్డ మేమిటి? నా స్కూలుఫీజుకట్టడానికే ఆయన ఆలస్యం చేసేవారు. నీకు అప్పివ్వడానికి ఆయనకు డబ్బు యెక్కడి నుంచి వచ్చింది?' అని సూర్యాన్ని అడిగాను.

"నా బోటిగాళ్లకు అప్పులిచ్చే అలవాటు ఉండబట్టే మీనాన్నగారు నీ స్కూలుఫీజు కట్టడానికి యిబ్బంది పడవలసి వచ్చేది. నాకు డబ్బు చేదా, నీకు ఉచితంగా యివ్వడానికి? హోటలు, కిళ్ళీకొట్ల బాకీలు, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, సూరిబాబు దగ్గర నువ్వు చేసిన చేబదుళ్లు తీర్చివేయగా ఈ యాభై రూపాయలు మాత్రం మీ నాన్నగారికి యివ్వవలసి ఉన్నాను. ఇప్పుడు అదికూడా తీర్చివేశాను" అన్నాడు సూర్యం కాని వాడు మా నాన్నగారికి బాకీ పడ్డాడనే సంగతి నాకు నమ్మదగినదిగా లేదు. అబద్ధమని వాడితో వాదించినా ప్రయోజనం లేదు. వాడు నాకోసం ఖర్చుపెట్టిన డబ్బు యిచ్చేద్దామా అంటే నాదగ్గర యేమీ లేదు. ఆ సమయంలో నా జేబులో రెండు మూడణాలు, సిగరెట్టుపెట్టి, అగ్గిపెట్టి తప్ప మరేమీ లేదు. అంచేత వాడు చెప్పిన దాని కల్లా ఊకొట్టవలసి వచ్చింది.

"నీ బట్టలూ పుస్తకాలూ వగైరా పెట్టిలో సర్దు. రేపు ఉదయం బయలుదేరి వెళ్లి కాలేజిలో జాయిను కావాలి" అన్నాడు సూర్యం.

"నువ్వు మాటాడే మాటలూ, చేసే పనులూ నా కేమీ అర్థం కావడం లేదు. నా స్థితి అంతా తెలిసుండీ కాలేజికి ప్రయాణం కట్టమంటావేమిటి?" అన్నాను చికాకుగా.

అంటే, డబ్బు లేదనేగా? దానికోసం ప్రస్తుతం బాధపడనక్కరలేదు. నీకు చేలమీది పంటవచ్చే వరకూ నేను పెట్టుబడి పెడతాను. పంట ధాన్యం వచ్చాక అవి అమ్మేసి నా బాకీ తీర్చివేద్దువుగాని. కాలేజిలో చదువుకొనే నాలుగేళ్ళూ నీకు వచ్చే ఆదాయం నాకు ఇచ్చేస్తూ ఉండు. చదువుకోసం నీకు కావలసిన డబ్బు యావత్తూ నేను పెట్టుబడి పెడుతూ ఉంటాను. నేను స్వతంత్రుణ్ణి. నన్ను అడిగే వాళ్ళెవరూ లేరు. అయినా, మీకు నేను ఉచితంగా యివ్వడం లేదుగా? నువ్వు యెంతమాత్రం సందేహించకు. కాలేజి చదువు పూర్తిఅయి ఒక మార్గంలో పడేవరకూ నేను చెప్పినట్లల్లా చేస్తూ ఉండు." అని దృఢంగా నెమ్మదిగా బోధించాడు.

"నన్ను లేనిపోని చిక్కులలో పెట్టకురా బాబూ! నీకు పుణ్యముంటుంది. నాకు చదువుకోవాలని ఎంత మాత్రం కోరిక లేదు" అని దీనంగా చెప్పాను.

"ఏం? నీకు వయస్సు ముదిరిపోయిందనా, సంసారం బాధ్యత తలపై పడిందనా, డబ్బుకి లోటు వచ్చిందనా, ఎంచేత, చదువుమానుకోవడం? నీ మనస్సుకి శాంతి లభించాలంటే నీ దృష్టిని చదువు వైపుకి మరల్చాలి. ఈ సంవత్సర మంతా చదువులేకపోవడం, మీ అమ్మ పోవడం, బ్రతికి ఉండికూడా మీ నాన్నగారు నిన్ను విడిచిపోవడం మూలాన్ని నీ మనస్సు పాడయింది. కష్టాలు యెవరికి రావు? కష్టాలు వచ్చినప్పుడే మన ధైర్యస్థైర్యాన్ని ఉపయోగానికి తెచ్చుకోవాలి. నాకు రాలేదూ, కష్టాలూ? మా నాన్న పోయాక నా పరిస్థితి అయోమయమైపోయిందే! మా అమ్మను చూస్తే వట్టి అమాయకురాలు. ప్రతి విషయానికి నా సలహాను ఆశించేది. అటువంటప్పుడు పై వాళ్లకు లోకువ యివ్వకుండా

జాగ్రత్తగా నేను యింటి వ్యవహారాలన్నీ చక్కబెట్టుకోనక పోతే ఈపాటికి నా యాభై యకరాల భూమికి అయిదెకరాల భూమి కూడా మిగిలి ఉండేది కాదు..నువ్వు లేనిపోని మనోవేదనతో నీ భవిష్యత్తును పాడుచేసుకోకు. నేను చెప్పినట్లల్లా చెయ్యి. ఇంక నువ్వు మారు మాట్లాడ్డానికి వీల్లేను. లేదా నేనూ చదువు మానేస్తాను. నువ్వు బికారిలా బజారులో తిరుగుతూ ఉంటే నా మనస్సుకి ఎంత బాధగా ఉందో నీకు తెలుసా? నువ్వు నాకు మామూలు స్నేహితుడివే కాదు. మీ నాన్నగారి ద్వారా నువ్వు నాకు పరమ ఆప్తుడవు. వారికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను. ఏడెనిమిది సంవత్సరాలు నాకు విద్యాబుద్ధులు చెప్పి నా జీవితానికి వెలుగుబాట చూపించారాయన. ఏనాటికైనా ఆయన, నిన్నూ నన్నూ చూడ్డానికి వస్తారు. వారి కొడుకువు నువ్వు అనాథుడవై మతి చెడినవాడిలా తిరుగుతూ నీచమైన జీవితాన్ని గడుపుతూంటే నేను చూస్తూ ఊరుకోనా? అనాడు ఆయనకు నేనేం జవాబు చెప్పను?...ఇదిగో రామం! నువ్వు నేను చెప్పినట్లల్లా చెయ్యకపోతే నీకంటె ముందుగా నేను పాడైపోతాను." అని ఆవేశంతో మాట్లాడి కూర్చున్నవాడు లేచి నిలబడ్డాడు. ఇంతవరకూ దిగ్రమింగుతూన్న దుఃఖం యిక ఆగలేదు. 'సూర్యం' అంటూ బావురుమని యేడుస్తూ వాణ్ణి కౌగలించుకొన్నాను.

మర్నాడు ఉదయాన్నే సూర్యం. మా ఊరు స్కూల్లో పనిచేస్తున్న మాస్టరుగారు మా యింట్లో అద్దెకు ఉండే ఏర్పాటు చేశాడు. ఒక గదిమాత్రం నా సామాన్లకోసం మినహాయించాం. తరువాత పట్నం వెళ్ళి కాలేజిలో చేరాం.

జానకివివాహం కానంతవరకు చదువులో నాకుండే శ్రద్ధ, చురుకుదనము మా తల్లిదండ్రులనీ చుట్టుపక్కల ఉన్నవాళ్ళనీ ఆశ్చర్యపరచేవి. చిన్నప్పటినుంచీ జానకి చదువుకీ ఆటపాటలకీ నేను సహాయకుడనుగా ఉన్న కారణంచేతనే మా మామ అత్త నన్ను తమ పిల్లతో పాటు ఆదరించేవారనీ, ఆమె వివాహమైన తరువాత నా అవసరంగానీ నా సహాయంగానీ అవసరం లేక నన్ను ఆదరించడం మానేశారనీ కొంతకాలానికి నాకు అర్థమైంది. కాని వివాహప్రసంగం వచ్చిననాటినుండీ జానకిలో మార్పు రావడానికి కారణమేమో నాకు బోధపడలేదు.

జానకి వివాహం కానంతవరకూ ఆమె నాకు ప్రాణస్నేహితురాలుగా ఉండేది. ఆమె నన్ను వదలిపెట్టిన సంవత్సరానికి సూర్యం నాకు పరమ ఆప్తుడయాడని చెప్పక తప్పదు. జానకి చదువుకి, ఆటలకు, పాటలకు నేను మార్గదర్శకుడుగా ఉండేవాణ్ణి. ఇప్పుడు ఒక్క చదువు విషయంలో మినహా మిగిలిన విషయాలన్నిటిలోను సూర్యం నాకు మార్గదర్శకుడయ్యాడు. కాలేజీలో చేరిన నాలుగైదు నెలలవరకు నా మనస్సును చదువులో లగ్నం చెయ్యడానికి సూర్యం తన చాకచక్యాన్ని, శక్తిని పూర్తిగా ఉపయోగించాడు. చదువంటు ఆసక్తి కలిగి దాని రుచి తెలిసినవాడవడం చేత సూర్యం ప్రయత్నం ఫలించింది. మా క్లాసు పుస్తకాలే కాకుండా లైబ్రరీలోని నవలలూ, నాటకాలూ తెచ్చి సూర్యానికి చదివి వినిపిస్తూండేవాణ్ని. చదువుమీద దృష్టి కలిగినమీదట క్రమేణా నా చేత, సిగరెట్టు కాల్చడం మానిపించాడు. అప్పుడప్పుడు వెనుకటి సంగతులు జ్ఞప్తికివచ్చినా సూర్యం ప్రయత్నంవల్ల మనస్సు స్తిమితపడేది.

కాలేజీ చదువు రెండేళ్లు పూర్తయింది. పరీక్షలయాక శలవుల్లో యింటికివెళ్ళాం. ఇంటికిచేరిన రెండు రోజులికి సూర్యానికి తీవ్రంగా జ్వరం వచ్చింది. నా మనస్సు పరిపరివిధాల పోసాగింది. రాత్రింబవళ్లు సూర్యందగ్గర ఉండి సేవచేస్తూండడమే నా పని. మాటామంతీ లేకుండా వళ్లు తెలియని స్థితిలో పది రోజులు పడియున్నాడు. ఊళ్ళో డాక్టరువల్ల తృప్తిలేక పట్నం వెళ్ళి డాక్టర్ని తీసుకొని వచ్చాను. ఆయన రోజూ కారుమీద వచ్చి చూచి పోయేవాడు. జ్వరం నానాటికీ విషమిస్తోందే కాని తగ్గడం లేదు. జ్వరంలో సంధి కూడా బయలుదేరింది. సూర్యం తల్లి "ఏం నాయనా! కాస్తచల్లగా ఉందా వళ్లు?" అని నిమిషనిమిషానికీ అడుగుతూండేది. "పరవా లేదు పిన్నీ, తగ్గుతుందని డాక్టరు గారు చెప్పారు. ఇంతకంటె యెంతో తీవ్రంగా ఉండే అసాధ్యమైన జ్వరాలు ఆయన సునాయాసంగా తగ్గించారు. కొంచెం టైమ్ తీసుకొంటుంది మరి. వెంటనే తగ్గించడానికి ఆయన మాత్రం దేవుడా?" అని యేవేవో కల్పించి ఆవిడకు ధైర్యం చెప్పేవాణ్ణి. కాని నా గుండెలు దడదడలాడుతూనే ఉండేవి. ఎంత కూడగట్టుకొన్నా ధైర్యం నిలబడ్డం లేదు.

ఇరుగుపొరుగు వాళ్లు తరచూ వచ్చిచూచి పోతూండే వారు. బంధువులమని చెప్పుకొనేవారు ఆయిదారుగురు వచ్చి వాళ్ళయింట్లో మకాం చేశారు. ఎంత మంది ఉన్నా రాత్రి పదిదాటాక సూర్యం తల్లీ నేనూ తప్ప మరెవరూ మేల్కొని ఉండే వారు కారు. పాపం ఆతల్లి తనజీవితసర్వస్వమైన కొడుకుమీద ప్రాణాలన్నీ నిలుపుకొని దెయ్యదేవుళ్లకు మ్రొక్కుతూ "ఏం బాబూ, కాస్తచల్లగా ఉందా వళ్లు?" అని అమాయకంగా అడుగుతూంటే నా కడుపు తరుక్కుపోయేది. అమ్మను పోగొట్టుకొన్న నేనెంత నిర్భాగ్యుణ్ణో కదా అని పరితపించే వాణ్ణి. సూర్యం రాత్రి వేళ యెక్కువగా పలవరించేవాడు. ఎంత సేపూ చదువునుగురించి, నన్నుగురించి, మాట్లాడేవాడు. చిన్నప్పుడు తను వల్లెవేసిన పద్యాలు చదివి "ఇవి మా వెంకన్న పంతులు గారు చెప్పారు, మహానుభావులు!" అని నమస్కారం చేసేవాడు. "చదువు చెప్పిన గురువు యెడల ఇంత భక్తివిశ్వాసాలు కలిగిన విద్యార్థులున్నారా యింకా యీలోకంలో. అబ్బా! ఎంత భక్తి, ఎంత కృతజ్ఞతా ఉందిరా సూర్యం నీ హృదయంలో!" అని అనుకొంటూ వానితోపాటు నేను కూడా మా నాన్నగారిని తలుచుకొని నమస్కరించేవాణ్ని. కళ్లనుండి నీరుపొంగి పొరలివస్తూండేది. మా సూర్యంతల్లికి కనుపించకుండా ముఖంవంచుకొని కళ్లుతుడుచుకొనేవాణ్ని. డాక్టరువస్తూ ఇంజక్షన్లూ, మందులూ ఇస్తూనే ఉన్నాడు. కాని జ్వరమూ సంధీ మమూలుగానే ఉంటున్నాయి. ఆ రోజుకి సూర్యానికి జ్వరం వచ్చి పందొమ్మిది రోజులైంది. ఆ రాత్రి పదిగంటలకి నేను సూర్యం మంచం ప్రక్క కుర్చీలో కూర్చున్నాను. మంచంమీద కాళ్ళ దిక్కున వాని తల్లి కూర్చునిఉంది వారింటికి వచ్చిన బంధువులు నలుగురైదుగురు పొరుగువాళ్లు కూర్చుని ఉన్నారు. జ్వరంవచ్చింది మొదలు నేటివరకూ సూర్యం తెలివిగా మాట్లాడ్డంగాని, అమ్మనుగాని నన్నుగాని పిలవడంగాని లేదు. ఆ రాత్రి పదిగంటలకి "అమ్మా"అని పిలిచాడు. "ఏం నాయనా? ఇక్కడే ఉన్నాను, యేంకావాలి?" అని ఆవిడ వాని ముఖందగ్గర ముఖంపెట్టి ఆత్రంగా అడిగింది. ఆమెకు జవాబేమీ చెప్పకుండా "రామం" అని పిలిచాడు. ప్రక్క నేకూర్చున్న నేను లేచి ఒంటి మీద చెయ్యివేసి "సూర్యం!" అని పలుకరించాను. "కూర్చో" అన్నాడు. మంచంమీద కూర్చున్నాను. "నువ్వు మనస్సుపాడుచేసుకొని తప్పు దోవల్లో పడవద్దు. నువ్వుచెడుగా నడిస్తే నాకు అన్యాయం చేసినట్టే. గౌరవంగా జీవిస్తానని నా మీద ఒట్టు పెట్టు" అని తనఅరచేతిని నా వడిలో వేశాడు. నా కళ్లు నీళ్లతో నిండిపోయాయి ఏమీ కనుపించడం లేదు గట్టిగా కళ్లు మూసుకొని వాని చెయ్యి తీసుకొని దానిలో నా అరచెయ్యివేసి "అలాగే" అన్నాను. 'ఇంక నేను జీవించను రామం; 'అమ్మా! అమ్మా!' అని రెండు సార్లు గట్టిగా అన్నాడు. 'ఏంనాయనా?' అని తల్లి యేడుస్తూ వాని ముఖందగ్గర ముఖం పెట్టింది. మరి సూర్యం మాట్లాడలేదు. ఆవిడ నేను ఒక్కసారి గొల్లుమన్నాము.

నన్నుకన్నతల్లి నా పదహారవయేట పరమపదించింది. అప్పుడే తండ్రికూడా మతిచలించి సర్వస్వమూ విడిచి విరాగియై యెక్కడికో వెళ్లిపోయాడు. చిన్నప్పటినుండీ ఒక్కపూటైనా విడువకుండా నేను ఆడితే ఆడి, పాడితే పాడి, చదివితే చదివి, తింటేతిని, విచారిస్తే విచారించిన జానకి తనకు వివాహం చేసిన వ్యక్తితో వెళ్లిపోయింది చివరికి నాకోసం తన సర్వస్వమూ త్యజించ సిద్ధపడిన పుణ్యమూర్తియైన స్నేహితుడు గతించాడు. మూడుసంవత్సరాలు గడచినా మా తండ్రిగారి జాడలేదు. ఇకవచ్చి నన్ను ఆదరిస్తారనే ఆశ సన్నగిలిపోయింది. ఆ గ్రామంలో ఒక్కపూట ఒకయుగంలా గడవసాగింది. గ్రామమంతా నరకంలా కనుపిస్తోంది. అవసాన సమయంలో సూర్యం చెప్పిన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఎక్కడికైనా పోదామా అంటే దగ్గర డబ్బులేదు. సూర్యం పోయిన మరునాడు యింటికి చేరాను. వాళ్ల యిల్లంతా బంధువులతోనూ, పరిచయస్తులతోనూ నిండిపోయింది. ఇంక అక్కడ నాకు నిలవడానికైనా తావులేదనిపించింది. ఇంటికిరాగానే మా అత్తవచ్చి పలుకరించింది. 'రా, అన్నంతిందువుగాని' అంది. వేరుగత్యంతరంలేక వెళ్ళి భోజనంచేశాను. రెండు రోజులు అక్కడే కష్టంతో కాలక్షేపం చేశాను. డబ్బు అప్పుయిచ్చేవాళ్ళెవరా అని ఆలోచిస్తే మా మామయ్యతప్ప మరెవరూ నా దృష్టికి కనుపించలేదు. ఆ గ్రామంలో ఉండడం దుస్సహమైపోయి మామయ్యను డబ్బు అప్పుకావాలని అడిగాను. 'ఎంత

కావాలి?' అన్నాడాయన. అయిదువందలు కావాలన్నాను. దీర్ఘంగా ఆలోచించి 'సరే' అని నా చేత నోటు వ్రాయించుకొని అయిదువందల రూపాయలు నా చేతిలో పెట్టాడు. డబ్బు చేతికివచ్చినతరువాత ఒక గంట కూడా ఆ ఊళ్లో ఉండలేదు వెంటనే ప్రయాణమై పట్నం చేరాను.

నా చదువు సూర్యంతోనే పోయింది. ఇప్పుడు చదవాలనే దృష్టే లేదు. చేతిలో ఉన్న అయిదువందలు అయేలోగా యేదో ఉద్యోగం సంపాదించుకోవాలి. సూర్యానికిచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవాలి. వాని ఆత్మశాంతికి ప్రధానంగా నేను చెయ్యవలసినదీ, చెయ్యగలిగేదీ వాగ్దానం నిలబెట్టుకోడమే అని నాకు తోచింది. ఒక భోజన హోటల్లో మకాం పెట్టి అక్కడికి వచ్చేపోయేవారిని చూస్తూ వారి సంభాషణలు వింటూ కాలంగడుపుతున్నాను. నేను ఏంచెయ్యాలి? అనే ప్రశ్న మనస్సులో మాటిమాటికీ బయలుదేరడమే గాని జవాబుతోచడంలేదు. హోటల్లోకి రకరకాల మనుష్యులు వస్తూపోతూ ఉండేవారు. నేనెవరితోనూ మాట్లాడకపోయినా రోజూ హోటలుకి వచ్చేవారు రెండుమూడురోజులు నేను అక్కడనే ఉండడం చూచికాబోలు, నా పేరు ఊరు, ఉద్యోగం మొదలైన విషయాలు తెలుసుకోడం ప్రారంభించారు. సంక్షిప్తంగా నా పరిచయ మిచ్చి ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నానని వారితో చెప్పేవాణ్ణి. రకరకాల ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళూ, వ్యాపారసంస్థల్లో పనిచేసేవాళ్లూ, పట్నంలో పనులమీద వచ్చేవాళ్ళూ భోజనంచేసి ఒక పావుగంటో అరగంటో హాలులోఉన్న కుర్చీలమీద బల్లలమీద కూర్చుని వారివారి పనులకు పోతూండేవారు. నా పరిచయం తెలియజేస్తే యెవరైనా ఏదైనా తోవ చూపిస్తారని నా ఆశ. నేను అనుకొన్నట్టుగానే ఒకరిద్దరు ఫలానా డిపార్టుమెంటులో కాళీలున్నాయని ఫలానా కంపెనీలో కాళీ ఉన్నట్టు విన్నానని చెబుతూ ఉండేవారు. వారివల్లనే వివరాలు తెలుసుకొంటూ ఉద్యోగానికై దరఖాస్తులు పంపేవాణ్ణి. కొన్నిచోట్లకువెళ్లి ఉద్యోగం యాచించేవాణ్ణి. లేదని స్పష్టమైన సమాధానం చాలా తక్కువచోట్ల నుండి వచ్చేది. ఉద్యోగం ఉంది చేరమనేమాట ఎక్కడా వినిపించేదికాదు. నేడో రేపో దొరుకుతుందన్న ఆశతో తిరుగుతూ ఉండేవాణ్ణి. ఒక వైపున సూర్యంతల్లిని చూడాలనే వేదన మనస్సులో ఉండేది. రెండు నెలలు గడిచాక మాఊరువెళ్లి తిన్నగా సూర్యం గారి యింటికి వెళ్లాను. ఆమె నన్ను చూడగానే గోలుగోలున యేడువసాగింది. ఆ విడతోపాటు నేనూపం, కొంతసేపు యేడ్చాను. మగవారు ఆడవారు, ఎవరో అయిదారుగురు వ్యక్తులు వారి యింట్లో ఉన్నారు. పావీరంతా ఆమె దుఃఖసమయంలో ఆదుకొని సేవ చేస్తున్నారు అని అనుకొన్నతరువాత నా మనస్సు ఊరట చెందింది. అక్కడినుంచి మా అత్తగారింటికి వెళ్లాను. వారు నేను యెక్కడ ఉంటున్నదీ, యేంచేస్తున్నదీ అడిగి తెలుసుకొన్నారు. నా భూమిశిస్తు వసూలు చేసి నా బాకీ క్రింద జమకట్టుకోమని మా మామయ్యతో చెప్పి ఆ పూట అక్కడనే తిండితిని తిరిగి పట్టణం చేరుకొన్నాను. తరువాత యెనిమిదిమాసాలు గడచిపోయాయి. దగ్గరనున్న అయిదువందలు కరిగి యాభై రూపాయ లయాయి మనస్సులో ఆందోళన యెక్కువైంది. ఉద్యోగం దొరకదనే నిరాశ బయలుదేరింది. ఒక రోజున తిండితిని నా ఉద్యోగ ప్రయత్నాలన్నీ నెమరువేసుకొంటూ కూర్చున్నాను. ఇంతలో నాకు పరిచయస్థుడైన షావుకారు గుమాస్తా గారు భోజనంచేసి వచ్చి నాప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ 'ఏమండీ రామంగారూ! ఇంకా ఎక్కడా ఉద్యోగం దొరకలేదూ?' అని ప్రశ్నించాడు. 'లేదండి' అని నిరాశతో జవాబిచ్చాను. మీరు తగినంత చదువుకొని చిన్నవయస్సులో ఉన్నవారు ఏదైనా మంచి ఉద్యోగం దొరుకుతుందని యిన్నాళ్ళనుంచీ ఊరుకొన్నాను. ఎన్నాళ్ళని పెట్టుబడిపెట్టుకొని ఇక్కడ తింటూ కూర్చుంటారు? మా దుకాణంలో చేరి పనిచేస్తూ ప్రయత్నం చెయ్యండి, మీ హోటలు ఖర్చైనా యెత్తిపోతూంటుంది. ఎప్పుడు మంచి అవకాశం దొరికితే అప్పుడే మానెయ్యొచ్చు' అన్నాడు. ఆకలి వేసేవాడికి గంజీ అన్నమైనా రుచిస్తుంది. ఏ యుద్యోగం లేక అయోమయస్థితిలోఉన్న నాకు గుమాస్తా ఉద్యోగమైనా మంచిదనిపించింది. 'మీ ప్రయత్నం వల్ల దొరుకుతుందాండి?' అన్నాను. 'నా ప్రయత్నం అవసరంలేదు. మిమ్మల్ని తీసుకొనివెళ్లి మా షావుకారు గారికి పరిచయంచేస్తాను. మిమ్మల్నిచూస్తే ఆయన కాదనడు. ఇంగ్లీషులో ఉత్తరప్రత్యుత్తరాలు జరపగలిగే గుమాస్తా మా దుకాణానికి చాలా అవసరం.'

'సరే, ఎప్పుడు రమ్మంటారు?' అని అడిగాను. 'ఎప్పుడో యెందుకు? ఇప్పుడే వెళదాం రండి' అంటూ లేచాడాయన. ఇద్దరం షావుకారుదగ్గరికి వెళ్ళాం. ఆయన తనగుమస్తా చెప్పినదానితో తృప్తిపడక నా ఊరు, పేరు, వెనకటి ఉద్యోగం, మా ఆస్తి, మా తండ్రిఉద్యోగం, ఎన్నాళ్ళనుంచి నేనుయిక్కడ ఉన్నదీ, యేం చేసినదీ మొదలైన విషయాలను గురించి బోనులో నిలబడ్డ ముద్దాయిని ప్లీడరు క్రాసుచేసినట్టుగా ప్రశ్నలు వేశాడు. ఇష్టంలేకపోయినా అన్నింటికీ వినయపూర్వకంగా సమాధానము లిచ్చాను. వ్యాపారంలోని కష్టనష్టాలను వర్ణించి చివరికి ముప్ఫై రూపాయల జీతంమీద పనిచేయమన్నాడు. నేను మారుమాటాడక అంగీకరించాను. తిండికి బట్టకి దేహీ యని ఒకర్ని యాచించకుండా వేరే ఉద్యోగ ప్రయత్నం మాని నాలుగేళ్లు అతి సామాన్యమైన జీవితం గడిపాను.

* * *

ఆనందమూ ఉత్సాహమూ యితరులలో చూచినప్పుడు 'ఇలా ఉంటాయా?' అనుకొనేవాణ్ని. యంత్రంలా ఉదయం ఎనిమిది మొదలుకొని రాత్రి తొమ్మిదింటివరకూ దుకాణంపనులు చక్కబెట్టడం, అప్పుడు హోటలుకి వచ్చి చల్లారిన అడుగు పదార్థాలు ఇష్టమున్నా లేకపోయినా మింగి కడుపునింపుకోవడం అక్కడే అరుగుమీదో, హాల్లోనో, దగ్గరగాఉన్న పార్కులోని సిమెంటు బల్లమీదనో జంఖానా పరుచుకొని పడిఉండడం. తల్లి, తండ్రి, జానకి, సూర్యానికి సంబంధించిన సంఘటనలు తలపుకువచ్చి కన్నీరు కార్చడం, అవిచారంతో నే కన్ను మూయడంతో, నీటితో బరువెక్కిన కారుమేఘాలు విశాలాకాశంలో పయనించినట్లు నా జీవితంలోని నాలుగుసంవత్సరాలు గతించాయి. చనిపోయిన మాఅమ్మను, సూర్యాన్ని పొంది, వారి పవిత్రప్రేమవాత్సల్యాలలో మునిగితేలుతూ నా జీవితాన్ని సుఖమయం చేసుకోవడం, యెంత అసంభవమో మతి చలించి విరాగియైపోయిన మా నాన్నయొక్క పితృవాత్సల్యంలో ఓలలాడడంగాని, ఒక వ్యక్తిని వివాహమాడి తన సర్వస్వాన్ని అతని అధీనం చేసిన జానకియొక్క అకృత్రిమమైన ప్రేమాలాపాలు వింటూ, మోహపరవశుడనై ఆనంద డోలికల్లో ఊగడంగాని, అంతగానూ అసంభవమయాయి. నిరాశ, నిస్తబ్ధత నా నరనరాల్లోనూ జీర్ణించిపోయాయి.

తరువాత ఒకరోజున ఉదయం పట్నంలోని అసామీ దగ్గర బాకీవసూలు చెయ్యడానికి సైకిలుమీద బయలుదేరాను. తలవని తలంపుగా జానకిని చూడ్డం, వారియింటికి వెళ్ళి వారి ప్రేమాభిమానాలకు చకితుడను కావడం తటస్థించింది.

వివాహసంబంధం నిశ్చయంఅయిన మరుక్షణంనుంచీ జానకిలో ఆశ్చర్యకరమైన పరివర్తన కలగడం, వసంత వాయువులకు చిగిర్చి, పుష్పించి, ఫలోన్ముఖమైన వృక్షాన్ని గొడ్డలితో కొట్టివేసినట్లయింది నాజీవితం. ఆమెలోని మార్పుకు కారణం నాకు అర్థంకాలేదు. ఆమెభర్తకు పది పన్నెండెకరాల భూమి ఉన్నదని వినికిడి. బి. ఎ. పాసయాడు. నెలకు నూటయాభై రూపాయల జీతంగల ఉద్యోగమనీ, పైగా నెలకు రెండు మూడు వందల రూపాయల రాబడి ఉంటుందనీ వారూ వారూ అనుకొంటూండగా విన్నాను. వివాహమైన తరువాత గడచిన యీయెనిమిది సంవత్సరాల్లోనూ, ఆమె తనభర్తతో పుట్టింటికి వచ్చినప్పుడు మూడుసార్లు నేను వారిని కలుసుకోవడం జరిగింది. అప్పుడు వారిద్దరూ నాయెడల చాలా ముభావంగా ప్రవర్తించడంవల్ల వారికి కలిగిన ఐశ్వర్యానికి అహంభావమూ, గర్వమూ వారిలో బయలుదేరాయనే భావం నాలోస్థిరమైంది కాని పట్నంలో వారింటి దగ్గర నేను వారిని కలుసుకొన్నప్పుడు నేను వారిని చాలాతప్పుగా అర్థం చేసుకొన్నానని అనుకొన్నాను. జానకిలోకంటె అతనిలో చాలా మార్పు కనుపించింది. వారు నన్ను వెంటనే వారింటికి మకాం మార్చమని చెప్పి సాగనంపినప్పుడు, నా హితవునుకోరి వారు ప్రేమతో ఆహ్వానించినప్పుడు, వారు చెప్పినట్లు చెయ్యడం మంచిదేమో అనిపించింది. వారినివిడిచి బాకీదారు యింటికివెళ్ళి అక్కడినుండి దుకాణంమీదకు వెళ్లాను. మనస్సు జరిగిన సంఘటనను విమర్శిస్తోంది. వేరేపని ఉందనిచెప్పి దుకాణంనుంచి విడుదలై హోటల్లో కుర్చీమీదకు చేరాను.

ఎదురుగావున్న గోడ గడియారం పన్నెండు కొట్టింది, లేచి హోటలు మేనేజరు దగ్గరకు వెళ్ళి 'నేను ఎంత బాకీ ఉన్నానో చూడమన్నాను.' గడచిన నెలా

ఖరికి బాకీ పూర్తిగా యిచ్చేశారుగదా, ఈ వేళఅయినా తారీఖున బాకీ మానేమంటున్నారేమిటి?" అని అన్నాడు మేనేజరు. 'మరేంలేదు, మకాం మారుద్దామా అనుకొంటున్నాను' అన్నాను సంకోచంగా. 'ఏందేమండీ, మావల్ల లోపమేమైనా జరిగిందా?' అన్నాడాయన, వేరే ఇంకో హోటల్లోకి మకాం మారుస్తానే అభిప్రాయంతో. 'అబ్బే, అలాంటిదేమీ లేదండీ; రామారావుపేటలో మా బంధువులున్నారు. వారింటిదగ్గర మకాం పెట్టి అక్కడనే భోజనం చేస్తూ ఉండమని బలవంతం చేస్తున్నారు. ఇంకా పూర్తిగా నిర్ణయం చేసుకోలేదు. వెళ్లడమా మానడమా అని ఆలోచిస్తున్నాను." అని ఆయనకు కొంత తృప్తిని కలిగించాను. "సరే. దానికేంలెండి, బంధువులింటి దగ్గర భోజనసదుపాయ మున్నప్పుడు మేము కాదన గలమా? మీరు ఎప్పుడు వెళ్లడానికి నిర్ణయించుకొంటే అప్పుడే మానుకొందాం." అని నా నిర్ణయానికి తగినంత అవకాశం కల్పించాడు. మళ్లీ నెమ్మదిగా పడకకుర్చీలో జేరపడ్డాను. ఏవేవో ఆలోచనలతో నిద్రపట్టింది. మెలకువ వచ్చి చూచేసరికి అయిదుగంటలైంది. ఆరోజున మరి దుకాణంమీదకు పోలేదు.

* * *

నాలుగురోజులు నా మకాముగురించి యే విధమైన నిర్ణయంలేకుండానే గడిచాయి. దుకాణంమీది వ్రాతపనిలో తుడుపులు, కొట్టివేతలు యెక్కువగా వస్తున్నాయి. ఏదోవిధంగా పని పూర్తిచేస్తున్నాను. ఆరోజు ఆదివారం. దుకాణంమీద పని ముగించుకొని రాత్రి తొమ్మిదింటికి హోటలు గుమ్మందగ్గరకు చేరాను. మెట్లు యెక్కబోతూ తటాలున ఆగాను. లోపల హాల్లో పరిశీలించి చూచాను. సందేహంలేదు, మా జానకి భర్త మేనేజరుకు యెదురుగా కూర్చుని యేదో మాట్లాడుతున్నాడు. కాళ్లు తడబడ్డాయి. అడుగు ముందుకి పోలేదు. తొందరగా ముఖంతిప్పి దగ్గరలో ఉన్న పార్కులోకి పోయాను. మూలగాఉన్న సిమెంటు బల్లమీద చతికిలపడ్డాను. తనకోసం వెతుకుతూన్న పోలీసునుండి తప్పించుకొన్న దొంగలా ఉంది నా అవస్థ. 'అతను నా కోసమే వచ్చిఉంటాడు లేకపోతే తొమ్మిదిగంటలకి నేను ఉండే భోజనహోటలుకి రావడానికి అతనికేంపని?' అని అనుకొంటూ నీరసంగా నిట్టూర్చాను. ఒళ్ళంతా చెమటపట్టింది.

చొక్కావిప్పి ఆ బల్లమీద నడుంవాల్చాను. మనస్సు కూడా అలసిపోయి ఆలోచించడానికి నిరాకరించింది. ఆరుబయట వీచే చల్లని గాలిలోకి, రేడియోలోని మధురగాన తరంగాల్లోకి నా సర్వేంద్రియాలూ నన్ను విడిచి పారిపోయాయి తెల తెలవారుతూ ఉండగా మెలకువ వచ్చింది. శరీర మంతా గజ గజ వణకి పోతోంది. తల బాయిలా బరువెక్కింది. కళ్లు తెరవడంలేదు. ప్రయత్నంచేసి నెమ్మదిగా లేచి చొక్కా తొడుక్కున్నాను. చలి ఆగలేదు. లేవబోయి తూలి మళ్ళీ కూర్చున్నాను. పళ్లు విరిగి పోతాయా అన్నంతగా దవడలు వణుకుతున్నాయి. మళ్ళీ బలవంతాన లేచి తూలుతూ నెమ్మదిగా హోటలు దగ్గరకు చేరాను. అక్కడ పనిచేసే నౌకరు నన్ను చూచి కంగారుగా యేమేమో ప్రశ్నిస్తూ లోపలికి తీసుకెళ్ళి పడక కుర్చీలో పరుండబెట్టాడు. నా పెట్టిమీది జంఖానా తెచ్చి నాకు కప్పాడు. మరి కొంతసేపటికి మేనేజరు వచ్చి నాకో మడతమంచం పక్కా వేయించి నన్ను దానిమీదకు చేర్పించాడు. ఆ రోజు పగలంతా జ్వరంతో ఒళ్లు తెలియకుండా పడి ఉన్నాను. రాత్రి నా వంటిమీద చెయ్యివేసి యెవరో లేపారు. కన్నువిప్పి చూచాను. జానకి భర్త నా మంచం ప్రక్క నిలబడి 'ఎలా ఉంది జ్వరం?' అన్నాడు. 'కొంచెం తగ్గింది' అన్నాను. 'రిక్షావీధిలో ఉంది, ఇంటికి వెళదాంలే!' అన్నాడు. 'ఇప్పుడు కాదు; జ్వరంతగ్గాక వస్తాను' అన్నాను. 'నే చెప్పినమాట విను, నీకేమీ శ్రమలేకుండా నేను తీసుకొని వెళతానుగా, లే!' అంటూ నన్ను లేవదీశాడు. గడియారం చూచాను, ఏనిమిదయింది. నానడుం చుట్టూ చెయ్యి వేసి నెమ్మదిగా నడిపించి రిక్షాలో కూర్చోబెట్టాడు. రిక్షావాడు నా పెట్టె తెచ్చి రిక్షాలో పెట్టాడు. హోటలు మేనేజరు మా దగ్గర శలవుతీసుకొన్నాడు. ఇంటికి చేరగానే జానకి మాకు యెదురువచ్చింది. 'కొంచెం జ్వరంవచ్చింది, మరేంలేదు' అని అతను ఆమెతో చెప్పాడు. ఆమె మమ్మల్ని లోపలి గది లోనికి తీసుకొని వెళ్ళింది. మంచంవాల్చి, దానిమీద పరుపూ పక్కా నిమిషంలో సిద్ధంచేసింది. మెత్తని దిండ్లపై తలవాల్చి పరున్నాను. అతను మెత్తని శాలువ నాకు కప్పాడు. అతను గదిబయటికి వెళ్ళాడు. ఇప్పుడు కన్నువిప్పి చూడలేనంత జ్వరం లేదు.

జానకి 'రామం!' అని పిలిచింది. 'ఊఁ' అన్నాను.

'ఏమైనా బాధగా ఉందా?'

'లేదు'

"జ్వరం యెప్పుడు వచ్చింది?"

"రాత్రి" అని చెప్పి కళ్లు విప్పి చూచాను. ఆమె నా మంచానికి దగ్గరగా నిలబడి ఉంది. మళ్ళీ కళ్లు మూసుకొన్నాను.

మరి పదినిమిషాలకి అతను డాక్టర్ని వెంట బెట్టుకొని వచ్చాడు. డాక్టరు నన్ను పరీక్షించి ఇంజెక్షను చేసి వెళ్ళిపోయాడు. తరువాత జానకి లోపలికి వెళ్ళి ఫ్లాస్కూ, కప్పు తెచ్చి కాఫీ కప్పులో పోసింది. 'కొంచెం కాఫీ తిసుకో, రామం' అంది. కాఫీ త్రాగాలనే కోరిక యెంతమాత్రం లేదు. కాని మనస్సు ప్రేరేపించకుండానే లేవబోయాను. అతను నన్ను పట్టుకొని లేవదీసి కూర్చో బెట్టాడు. జానకి తన చేతితో కప్పును నాకు అందించింది. జానకి చేతిలోని కప్పు నెమ్మదిగా తీసుకొన్నాను. కాఫీ త్రాగాలి, అందుకోసం యీ కప్పు తీసుకొన్నాను అనే జ్ఞానం లేదు. ఆమె చేతిమీద, ఆ చేతితో యిచ్చే కప్పును తీసుకోడం మీదనే నా దృష్టి లీనమైపోయింది. బంగారు గాజులతో గోధుమ రంగుగా ఉన్న నున్నని ముంజేయి, అక్కడక్కడ యెఱుపురంగును చిందే పలుచని వ్రేళ్లు నామనో ఫలకం మీద స్పష్టంగా చిత్రితమయాయి 'ఏం? ఆలోచిస్తున్నావ్? కొంచెం త్రాగు' అని ఆమె అనగానే, ఆ కప్పులో కాఫీ ఉన్నదని, దాన్ని నేను త్రాగాలని మనస్సుకు తట్టింది. రెండు గుక్కలు త్రాగి కప్పు ఆమె చేతికందిచ్చాను. ఇంతసేపూ అతని చెయ్యి నాభుజంమీద ఉన్నదనే జ్ఞానం అప్పుడు కలిగింది. ఇక నేను పడుకుంటానని తలచి కాబోలు, అతను రెండవ చేతిని నావక్షంమీద వేశాడు. నెమ్మదిగా పడుకున్నాను. తరువాత రేడియోలో పాట ప్రారంభమైంది. ఇద్దరూ చెరో కుర్చీమీద రేడియోపాట వింటూ కూర్చున్నారు. తరువాత కొంతసేపటికి నేను నిద్రపోయాను.

మరునాడు నాకు మెలకువ వచ్చి లేచి కూర్చున్నాను, జ్వరం బాగా తగ్గినట్లే ఉంది. అప్పటికి సూర్యోదయ కాంతులు గదిలోకి ప్రసరిస్తున్నాయి. విశాలమైన కిటికీల తలుపులు తీసి ఉన్నాయి నాకు చుట్టూ తెల్లని వెల్ల గోడలమీద, పసిడిఛాయలు ప్రతిఫలిస్తున్నాయి. ఆ గది అతి స్వచ్ఛంగానూ, పరమపవిత్రంగానూ నా కళ్ళకు గోచరించింది. నేను పడున్న మంచమూ, దానిమీది పక్కా, నేను కప్పుకొన్న శాలువ కన్నుల విందుగా ఉన్నాయి. తెల్లని తలగడ గలేబుమీద చక్కని పుష్పాలు రంగురంగుల సిల్కు దారాలతో చిత్రించబడి ఉన్నాయి. రాత్రంతా ఈ తలగడమీద నేనా, నా తలఉంట! అన్న ఆశ్చర్యం కలిగింది. అరచేతిని తలగడమీద ఉంచి నొక్కాను ఎంతో మృదువుగాను, నున్నగాను ఉన్న ఆ తలగడ, నా చేతికి సుఖాన్ని కలుగజేసింది. హాల్లోని రేడియోనుండి ఎవరో కలకంఠి కళ్యాణిరాగం ఆలాపిస్తోంది.

ఇంతలో తలుపుతోసిన చప్పుడు విని అటు చూచాను ఉషారాణి నా గదిలో ప్రవేశిస్తున్నట్లు తోచింది. గులాబి రంగుచీర, ఆకుపచ్చని జాకెట్టు, పచ్చని నిండు మొగము, కలువరేకులవలె విశాలంగాను, తేజోవంతముగాను ఉన్న కళ్లు, గంభీరమైన ముఖముద్ర, చూచేటప్పటికి "కాటుక కంటినీరు చను కట్టు పయిన్ బడ నేల యేడ్చెదో" అన్న పద్యం స్మృతికి వచ్చింది. రెప్ప వాల్చకుండా ఆ దేవిని నఖశిఖ పర్యంతమూ నివ్వెరపాటుతో చూస్తున్నాను. 'నిన్నాకటికిం గొనిపోయి, అల్ల కర్ణాటకిరాత కీచకులకు అమ్మ, త్రిశుద్ధిగ నమ్మ భారతీ!' అనే పద్యపాదం అప్రయత్నంగా మనస్సులో రెండుసార్లు మననం చేశాను. ఆమెకు వివాహమైన తరువాత ఆమె మూర్తిని పూర్తిగా చూచినది నేడే. నేను ఆమెను చూడ్డానికా అన్నట్లుగా ఒకేఒక నిమిషం నిశ్చలంగా నిలబడింది. ఇంతలో ఆమె భర్తవచ్చి 'ఎలా ఉందోయ్?' అని నా వంటిమీద చెయ్యివేశాడు. 'చాలా వరకు తగ్గినట్లే ఉంది.' అని జవాబిచ్చాను. 'ఆఁ, బాగుంది, ముఖం కడుక్కొంటావా?' అన్నాడు. 'ఊఁ' అంటూ లేచాను. అతను నా భుజం పట్టుకొని స్నానాలగది దగ్గరకు నడిపించాడు. మా వెనుకనే జానకి ఎత్తుపీట తెచ్చి వేసింది. దానిమీద కూర్చుని ముఖం కడిగాను. వెంటనే తెల్లని పొడి తువ్వాలు అందించింది. ముఖం తుడుచుకొని మళ్ళీ మంచం దగ్గరకు వచ్చి కూర్చున్నాను. 'డాక్టర్ని తీసుకొస్తాను'

అని అతను బయటకు వెళ్లాడు జానకి నాకు యెదురుగా గది గుమ్మంలో నిలబడింది. నేను తలవంచుకొని కూర్చున్నాను. "ఆ రోజు మధ్యాహ్నమే వస్తానని వెళ్లావు ఇంకా వస్తావు యింకా వస్తావని కనిపెట్టుకొని ఉన్నాను." అని, నా సంజాయిషీకై కాబోలు ఊరుకొంది. "దుకాణంమీద పని తొందర చేత రాలేక పోయాను." అన్నాను. అంతటితో ఊరుకొనక "ఆ మర్నాడైనా వచ్చావుకావు..."అని మళ్ళీ నా జవాబుకై యెదురు చూచింది. ఇంకా అసత్యం కల్పించి చెప్పడానికి నా అంతరాత్మ నిరాకరించింది. నేను మాట్లాడలేదు. "నీ కష్టసుఖాల్లో పాల్గొనే బాధ్యత నాకు లేదనుకున్నావా? ఎంత చనువుగా ఉండే వాడివి. ఈనాడింత మొగమాట పడితే ఎలా? ఆయన నా కంటె యెక్కువ అభిమానంతో రమ్మని పదే పదే చెప్పారు కూడాను. త్వరలో నీకు యేదైనా అనుకూలమైన ఉద్యోగం దొరకడం, పెళ్ళి చేసుకోడం జరిగిందంటే మేము ఉండమనడం నువ్వు ఉండడం రెండూ జరగవు. అంతవరకూ నువ్వు మా యింట్లో ఉండడం తప్పదు." అని తన మనోనిశ్చయాన్ని వెల్లడించి అలాగే నిలబడి ఉంది. నేనింతవరకు ముఖమెత్తనే లేదు. నా పెళ్ళిమాట ఆమె నోటినుండి వినగానే నేను రెండు చేతులతోను నుదుటినుండి పైకి తలంతా గట్టిగా రాసుకొన్నాను. కూర్చున్న వాడిని పరుండి కప్పుకొని కళ్లుమూసుకొన్నాను — చిన్నప్పుడు, మాకు ఇంకా ప్రపంచజ్ఞానంలేని రోజుల్లో ఆమె భార్యగాను నేను భర్తగాను ఉండి ఆటలాడే వాళ్ళం. ఆ తరువాత భార్యాభర్తలు అంటే యేమిటో కొంత అర్థమయే రోజుల్లో, అనగా నాకు పద్ధానుగు, ఆమెకు పదమూడు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు—అవి వేసవికాలపు రోజులు—లొమ్మిదింటివరకూ చదువుకున్నాం. వాళ్లి యింటిముందున్న గచ్చుచీడీమీద పొడుగునా వాళ్లి అమ్మకు, నాన్నకు, నాకు, జానకికి నాలుగు మంచాలు, పక్కలు వేయబడి ఉన్నాయి. ఆ ఇంటి ముంగిలిని వీధికి మరుగుపరుస్తూ గోడ ఉన్నది. పున్నమి చంద్రుడు ఆకాశంలో వెండిపళ్లెంలా వ్రేలాడుతున్నాడు. మంచాలమీదనున్న పక్కలు పాలజాళ్లు పరచినట్లున్నాయి. వాళ్ల అమ్మా నాన్నా, మా అమ్మ, ఇంకా ఇరుగు పొరుగువాళ్లు వాళ్ల నడవలో కూర్చుని పురాణం వింటున్నారు. నేనూ జానకీ మాత్రం చదువు ముగించగానే ఇంటి ముంగున్న మంచాల దగ్గరకు చేరాం. నేను, చదివినందువల్ల కలిగిన అలసటను తీర్చుకోడానికి నాకై వేసిన మంచం మీద వెల్లకిలా పడుకున్నాను. జానకి నాకు ప్రక్కనున్న మంచంమీద కూర్చుని తదేక దృష్టితో నన్ను చూడసాగింది. 'అలా చూస్తున్నావేం నాముఖంకేసి?' అని ప్రశ్నించాను లేచి నా మంచం ప్రక్కనే నిలబడి నా ముఖంలో చూస్తూ 'రామం, నీ ముఖం ఎంత అందంగా ఉంది' అని నా మీదకువంగి నా తలను తన రెండు చేతులతోనూ పట్టుకొని నానుదుటిని ముద్దుపెట్టుకొంది. నాకు సిగ్గూ, బెదురూ కలిగి యెవరైనా ఉన్నారేమో నని అటూ యిటూ చూచాను ఆమె తలను నా రెండు చేతులతోనూ నిమిరి "మంచంమీద కూర్చో, యెవరైనా చూస్తారు." అన్నాను. "చూస్తే తప్పేం? మన మెలాగూ భార్యాభర్తలమే. రామం, మనల్ని వేరు చెయ్యగలవాళ్లెవరు? నిన్ను విడిచి నేనూ, నన్ను విడిచి నువ్వూ ఉండగలమా?" అని తన పక్కమీద పడుకొక్కని అటూ యిటూ దొర్లింది. నేనేమీ జవాబు చెప్పలేదు—అటువంటి జానకి వేరొక వ్యక్తిని వివాహం చేసుకొంది. ఏ మాత్రమైనా ఆమెకు హృదయమనేది ఉంటే తన జీవితంలో నా ముఖం చూడగలిగేదికాదు, నాతో మాట్లాడగలిగేది కాదు. అలాటి లక్షణాలేవీ ఆమెలో లేకపోగా. మన మెలాగూ భార్యాభర్తలమే, మనల్ని వేరు చెయ్యగలవారెవరు? నిన్ను విడిచి నేనూ, నన్ను విడిచి నువ్వూ ఉండగలమా?-అన్న నోటితోనే యీనాడు నా పెళ్ళిప్రసంగం తెచ్చింది. మరెవరైనా నా పెళ్లిని గురించి మాట్లాడితే నాకు బాధపడవలసిన అవసరం లేదు. ఆమె నోటినుండి నా పెళ్ళిమాటరాగానే 'నా పెళ్ళిగొడవ దీనికెందుకు? నేను పెళ్లాడితే తనకేం సన్యాసినైతే తనకేం? నాతో కొన్ని సంవత్సరాలుగా చెప్పిన మాటలు చేసిన చేష్టలు మరచి వేరొకణ్ణి పెళ్లాడి కులుకుతోందిగా!' అనే భావం నాలో కలిగి ఆమె మీద కోపం వచ్చింది. కళ్లు మూసుకొని పరున్నవాణ్ణి. తలెత్తి "ఏ ముఖం పెటుకొని యీ మాట లంటున్నావ్?" అనే భావంతో ఆమె ముఖంలోకి చూచాను. ఆమె ముఖం గంభీరంగా ఉంది. ఆమెకు పెళ్ళిప్రయత్నం ప్రారంభమైననాటినుండి ఆ ముఖంలో నవ్వుగాని, దుఃఖంగాని నేనెప్పుడూ చూడలేదు. ఇప్పుడు కూడా ఏ భావమూ ఆ ముఖంలో

నాకు గోచరించలేదు. కాని ముఖంలోని లావణ్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. కళ్లలోని కాంతి, ముఖంలోని నిశ్చలత నా హృదయంలోని కోపాన్ని ఇంద్రజాలంలా దూరం చేశాయి. మనోదౌర్బల్యం కలిగిన మానవుడు ఆ కళ్ళలోకి చూడలేడు. ఆముఖంలోని గాంభీర్యాన్ని చూడగానే 'ఈమె పెళ్ళి చేసుకోని కులుకులోంది' అనే నా మనస్సులోని భావం సూర్యరశ్మికి మంచు విడినట్లు విడిపోసాగింది. నేనేమీ మాట్లాడకుండా కళ్లు మూసుకొని పరున్నాను.

ఆమెభర్త డాక్టర్ని వెంటబెట్టుకొని వచ్చాడు. డాక్టరు నన్ను పరీక్ష చేసి ఇంజక్షన్ చేసి 'ఇంక కొద్దిగా ఉంది జ్వరం, సాయంకాలానికి పూర్తిగా తగ్గిపోతుంది. కావలసినప్పుడు కాఫీ, హార్లిక్సు, గ్లూకోజు వాడండి' అని చెప్పి వెళ్లిపోయాడు. జానకి భర్త నౌకరు కుర్రవాణ్ని హార్లిక్సు, గ్లూకోజు తెమ్మని బజారుకి పంపాడు. నాకుదగ్గరగా కుర్చీలో కూర్చున్నాడు. జానకి కాఫీకప్పు పట్టుకొని వచ్చింది 'కొంచెం కాఫీ తీసుకోవోయ్!' అని అన్నాడతను, 'ఇప్పుడేమీ వద్ద'న్నాను. జానకి మంచం దగ్గరగా వచ్చి కొంచెం తీసుకో. నీరసం తగ్గుతుంది. అంటూ కప్పు ఉన్న చెయ్యి నా వైపుకి చాపింది. ఆమె చేతిని చూస్తూ కప్పు తీసుకొని సగం త్రాగి కప్పు తిరిగి ఇచ్చివేశాను. ఇంక కూర్చోవడం కష్టమనిపించి మంచంమీద పరుండి కళ్లు మూసుకొన్నాను. చిన్నప్పుడు, నాకు యిష్టంలేని వస్తువుల్ని, నేను, 'తినను' అన్నవస్తువుల్ని ఆమె సునాయాసంగా, నాచేత తినిపించేది. ఆ గారడీ ఆమె మాటల్లో ఉందో, చేతుల్లోఉందో లేక కళ్ళల్లోఉందో గాని, నేను ఆమె చేత్తో యిచ్చే పదార్థాన్ని, నాకు యిష్టమున్నా లేకపోయినా తినే వాణ్ని-పాతబడిపోయిన ఆ అలవాటు నేడు మళ్ళీ ఆ ప్రయత్నంగా తలెత్తింది. త్రాగాలనే కోరిక లేకపోయినప్పటికీ జానకి చేతితో యిచ్చిన కాఫీ రెండుసార్లు చవిచూడ్డం జరిగింది, వెల్లకిలా పరుండడం సదుపాయంగా లేక. ప్రక్కకు ఒత్తిగిలుతూ కన్ను విప్పిచూచాను. గదిలో జానకి లేదు. అతను కుర్చీలో కూర్చుని పత్రిక చదువుతున్నాడు. 'ఇప్పుడు రేడియోప్రోగ్రాం మంచిదేదయినా ఉందేమో?' అన్నాను. మరచిన వాడిలా చటాలున లేచి వెళ్ళాడు, 'పంతీసుమారి' రికార్డు సంగీతం వినవస్తోంది. 'ఇదే ఉంచనా, మార్చనా?' అంటూ అతను గుమ్మందగ్గర నిలబడ్డాడు, 'ఉండనీ' అన్నాను వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. పద్యాలు వింటున్నాను-ఆదిద్వాపరయుగం. చాతుర్వర్ణ్య వ్యవస్థ కట్టుదిట్టంగా నడిచే కాలం. యజ్ఞయాగాది క్రతువులు యథావిధిగా జరిగేవి. వేదాధ్యయనం దేశం నలుమూలలా జరిగేది. ఋషీశ్వరుల ధర్మోపదేశాలు విరివిగా సాగేవి, సాంఘిక నియమాలు బలవత్తరంగా ఉండేవి. ఎంత బలవత్తరంగా ఉన్నా, ఆనాటి సాంఘిక నియమాలుకూడా మానవ సహజ ప్రవృత్తులను కట్టి పాతిపెట్టలేక పోయాయేమో! లేకపోతే, అసూర్యంపశ్య, రాజాంతః పురవాసిని యైన కన్య సూర్యుని కలియడం, పుత్రోదయమవడం, లోకానికి భయపడి పసిబిడ్డను నదిలో విడిచివేయడం జరిగిఉండేది కాదేమో! అని మనస్సులో తలపోస్తూ పరున్నాను. పద్యాలు పూర్తయాక వాద్య సంగీతం వింటూఉండగా అరగంట గడిచింది. "కారుఉందా? మా షావుకారుకి నాకు జ్వరం వచ్చినట్లు తెలియజెయ్యాలి" అన్నాను. అతను కార్డు పెన్ను యిచ్చాడు. కార్డు వ్రాశాక అతను, నౌకరు, నాయుణ్ణి పిలిచి కార్డు పోస్టు చెయ్యమన్నాడు." అతను! స్నానంచేసి వస్తానోయ్!' అని లేచివెళ్లాడు. మరి పది నిమిషాలకి జానకి వచ్చి 'గ్లూకోజు యివ్వనా హార్లిక్సు యివ్వనా?' అని అడిగింది. 'ఇప్పుడేమీ వద్దు, నీరసంగాలేదు.' అన్నాను. ఆమె మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. 'వద్దంటే యింత తేలిగ్గా వదిలివెళ్ళిందేమా!' అనుకొన్నాను. ఆమె పెట్టబోయిన పదార్థం వద్దని అన్నానంటే తప్పకుండా నా చేత తినిపించే స్వభావం జానకిది. మరొక అరగంటకు అతను వచ్చి 'తేలిగ్గా ఉందా?' అని పలుకరించి వెళ్లాడు. రేడియోలో వయొలిన్ వాద్యం వినవస్తోంది. పరుండడం కష్టమనిపించి గదిలో ఆమూలనుండి యీమూలకు పచారుచేశాను. గదిలో బల్లమీద ఉన్న పుస్తకాలు తిరగేసి పేర్లు చదివాను. వారపత్రికలూ, ప్రేమ్‌చంద్, శరత్‌బాబు నవలలు నాలుగైదు ఉన్నాయి ఒక నవలతీసి పడక కుర్చీలో కూర్చున్నాను. పేజీలు తిరగేశాను. చదవడానికి మనస్సుపోలేదు. అక్కడినుండి లేచి మంచంమీద కూర్చున్నాను ఇంతలో అతను బట్టలు వేసుకొనివచ్చి "ఆఫీసుకి వెళ్ళివస్తానోయ్! నీకు కాలక్షేపానికి కావలిస్తే వారపత్రికలూ పుస్తకాలూ ఉన్నాయి. నీకు

చదవడానికి నీరసంగా ఉండొచ్చు. జానకీ చదివి వినిపిస్తుంది. విను నౌకరుకుర్రాడు ఇంటివగ్గరే ఉంటాడు. అవసరమైతే డాక్టరుగారికి కబురు చెయ్యండి. మన ఇంటికి యెదురుగానే డాక్టరుగారున్నారు." అనిచెప్పి పత్రికలూ పుస్తకాలూ ఉన్న చిన్నబల్ల నామంచం దగ్గరకు లాగాడు. 'మరి వెళ్ళిరానా?' అని నాకేసి చూసి వెళ్ళిపోయాడు. మరోక్షణానికి జానకి కప్పు చేతబట్టుకొనివచ్చింది. "వద్దన్నానుగా? ఇప్పుడు అవసరంలేదు" అన్నాను. "వద్దనడం నీకు అలవాటు, వద్దంటే తప్పకుండా త్రాగించడం నాకు పరిపాటి" అయినా ఎల్లోపతీవైద్యానికి, ఇంజక్షనూ, ఆపరేషనూ కాఫీ, హార్లిక్సు, గ్లూకోజు, బార్లీనీళ్లు, బత్తాయి ప్రధాన లక్షణాలు. ఎంత జ్వరంగాఉన్నా ఏదోఒక పానీయం తప్పక తీసుకోవాలి" అని అంటూ కప్పు నాముఖానికి ఒక అడుగుదూరాన్ని పట్టుకుంది. నాదృష్టికి యెదురుగానున్న గులాబిరంగుచీర, నున్నగాను గోధుమవన్నెగాను ఉన్న ముంజేయి, బంగారుగాజులు, కోమలమైన వ్రేళ్లు, ఒకవ్రేలికి నీలిరంగురాడిగల ఉంగరము, తెల్లగా మెరిసే పింగాణీకప్పు ఒకటిరెండు క్షణాలసేపు నామనస్సుకి శాంతినిచ్చాయి. అప్రయత్నంగా కప్పు తీసుకుని పరధ్యానంగా, రుచి తెలియకుండా కప్పులోనిది త్రాగాను. ఆమె నాచేతిలోని కప్పుతీసికొని లోపలికివెళ్ళి అయిదునిమిషాలకే తిరిగివచ్చింది. 'ఏమైనా చదవమన్నావా?' అంటూ బల్లమీది పుస్తకాలూ పత్రికలూ క్రిందా మీదా సవరించింది. 'నీకు తోచింది చదువు' అంటూ నడుంవాల్చాను. ఒక వారపత్రిక విప్పి 'కింకర్తవ్యవిమూఢ' అనే శీర్షికగల కథ ఒక గంటసేపు చదివి వినిపించింది. కథ చివరిభాగం చదువుతూ నాలుగైదుచోట్ల రెండుమూడు క్షణాలు ఆగుతూ, గొంతుక సవరించుకుంటూ, కళ్లు తుడుచుకుంటూ కష్టంమీద పూర్తిచేసింది. నేనూ తన్మయుడనై విన్నాను. నాలుగైదు అశ్రుబిందువులు నాకళ్లనుండి రాలాయి. అది ఒకకన్య విషాదగాథ. కథావస్తువులో వింతయేమీ లేదు. గాని రచనావిధానం పాఠకుల హృదయాలను కరిగిస్తోంది—మరణోన్ముఖియైన తల్లి, వివేకశూన్యుడైన తండ్రియొక్క ఆజ్ఞానుసారం తాను అసహ్యించుకునే వ్యక్తిని వివాహమాడడమా? లేక తన తల్లిదండ్రులనూ, సంఘాన్నీ, సాంఘిక నియమాలనూ తృణీకరించి, తాను మనసార ప్రేమించి, తన జీవిత సర్వస్వమూ, తన ఆరాధ్య దేవతఅయిన ప్రియునితో పట్నంపోయి, రిజిస్టరుమేరేజి చేసుకోవడమా; అనే సమస్యకు గురియై చివరికి యేమి చెయ్యడానికి తోచక ఆత్మహత్య చేసుకున్న కన్య విషాదగాథ— కథ కరుణారసభరితంగా చిత్రించబడింది. జానకి కథ పూర్తిచేసి రెండునిమిషాలు మాట్లాడకుండాకూర్చుంది. తరువాత "చాలా మంచిపనిచేసింది" అని నిట్టూర్చింది. "మంచి పనికాదు, తెలివి తక్కువ పని" అని అన్నాను నేను. "ఆడుదాని హృదయం తెలియని మగవాళ్లకు అలాగే కనుపిస్తుంది. తల్లిదండ్రుల మాటప్రకారం చేసిందా, తనజీవితంలో సుఖమూ శాంతీ లేక జీవితాన్ని నాశనం చేసుకోన్నదౌతుంది. కుళ్లి, కుమిలి, కృంగి యెప్పుడో నశిస్తుంది. అటు ప్రియునిచేరిందా, తల్లిదండ్రుల దుఃఖం, సంఘపు శూలపుపోట్లు ఆమెను పీడించి, పీల్చి, పిప్పిచేస్తాయి. ఆస్థితిలో ఆమెకు మరణమే కర్తవ్యం." అని ఆవేశంతో మాట్లాడింది. "తల్లిదండ్రుల ఆజ్ఞానుసారంగా తమకు యిష్టంలేని వ్యక్తిని పెండ్లాడిన స్త్రీలు మొదట కొంతకాలం బాధపడినా, తరువాత ఆ భర్తతోనే తృప్తిపడి గతాన్ని మరచి, సుఖించేవాళ్లు లేరా?" అన్నాను గంభీరంగా.

"అలాంటివారు యెవరినీ మనసార ప్రేమించి యుండరు. వారిలోనిది తాత్కాలిక వ్యామోహం. పసిబిడ్డచేతిలో మిఠాయి లాగితే, యేడవడం సహజం. వెంటనే ఆబిడ్డచేతిలో లక్కదొంతకాయ పెడితే యేడుపు మానేసి, దాన్నే నోట్లోపెట్టుకొని ఆడడం కూడా సహజమే. వ్యామోహానికి గురియైన స్త్రీపురుషులు కూడా అంతే. మనోవాక్కాయ కర్మలతో ప్రేమించిన వస్తువు దొరకనివారికి మరణమే సుఖం." అని దృఢంగా చెప్పింది. మరి నేను మాట్లాడలేదు. ఒకసారి ఆమె ముఖంచూచి కళ్లుమూసుకొన్నాను. ఆమె గంభీరమైనముఖం నా మనోఫలకంమీద ప్రతిఫలిస్తోంది. "అయితే, ఈమె సుఖపడ్డంలేదా?" అన్న సందేహంకలిగింది — మా చిన్నతనంలో. మాకు యేడెనిమిది సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, మేమిద్దరం వాళ్లహాల్లోని మంచపు ఉయ్యాలలో రోజూ గంటలతరబడిని ఊగుతూండేవాళ్లం. ఎప్పుడైనా వీధిలోకిపోయి మిగిలిన పిల్లలతో ఆటలాడాలని నాకు మనసుకలిగేది. నేను జానకిని యేదోవిధంగా

మరపించి బయటికిపోదామని ప్రయత్నించేవాణ్ణి. కాని నాకంటె ఎక్కువ తెలివిగా నేను వెళ్ళిపోతానన్నవిషయం కనిపెట్టేది జానకి. నన్ను వెళ్ళనివ్వకుండా ఉంచడానికి యేవేవో ప్రారంభించేది. వాళ్ళ అమ్మ మాయిద్దరికీ యేదైనా తినుబండారం పెట్టి నన్ను బ్రతిమాలి ఆపుచేసేది. నాకోసం మరి ఒకరిద్దరు పిల్లల్ని పిలిచి ఉయ్యాల ఊగమనేది. నేను, జానకి ఉయ్యాల మీద కాళ్ళు క్రిందకు వ్రేలాడేసి కూర్చునేవాళ్ళం. నేలను తన్నుతూ ఊపుకొనేవాళ్ళం. అందులోనే పాటలు పాడుకొంటూ పాఠాలు చదువుకొంటూ, కథలు చెప్పుకొంటూ కాలంగడిపేవాళ్ళం. మా వయస్సులు పెరిగినకొద్దీ ఉయ్యాల ఊగడం తగ్గించాం. చదువూ, ఆటలూ, పాటలూ ఎక్కువయాయి. ఒకనాటి సంఘటన యీనాటికీ నాకు కళ్ళకు కట్టినట్లుంటుంది. అప్పుడు జానకివయస్సు పద్నాలుగు; నా వయస్సు పదిహేను ఉంటుంది. మాఊరికి మైలున్నర దూరంలో చిన్నపల్లెటూరు ఉంది. అక్కడ జానకి పినతల్లి ఉంటోంది. ఆ ఊరు వెళ్ళడానికి మా ఊరు నుంచి రోడ్డు లేదు. చేలగట్లంట వెళ్ళాలి. బాట విశాలంగానే ఉంటుంది. మా పెద్దవాళ్ళతో మేము తరచుగా రాకపోకలు సాగించేవాళ్ళం. ఆనాడు జానకి, పినతల్లిగారింటికి వెళ్ళాలని ప్రయాణమైంది. నేను రానని యెంతచెప్పినా వినలేదు. నన్నుకూడా ప్రయాణంచేసింది. వాళ్ళ అమ్మ 'పాలేరును కూడా పంపిస్తాను, రేపు వెళుదువుగాని' అంది. కాని ఆమె వారికి గారాబుకూతురు. "పాలేరక్కరలేదు. నేనూ రామం వెడతాం" అంది. వాళ్ళఅమ్మ తప్పనిరిగా ఒప్పుకొంది. మధ్యాహ్నం మూడుగంటలౌతుంది. వెడల్పైన చేలగట్లమీద, బాటకుండా పిచ్చాపాటీ చెప్పుకొంటూ బయలుదేరాం. చుట్టూ యెటుచూచినా పచ్చగా పండినచేలు చేలగట్లమీద పొడుగునా కందిమొక్కలు పసిడి పువ్వులతోనూ, ఆకుపచ్చని ఆకులు, కాయలతోనూ మా భుజాలకు తగులుతూ ఉన్నాయి. మేము అడుగులో అడుగులేసుకొంటూ, లేత కందికాయలు కోసుకొనితింటూ, ఒకగంటకు ఒక అరమైలుదూరం నడిచాం. నాలుగు గంటలౌతుంది. గాలి చల్లగాఉంది. ఎండ శరీరానికి సుఖంగా తగులుతోంది. పిచ్చుకలు కిచకిచమంటూ చేలమీదా, కంది మొక్కలమీదా యెగురుతున్నాయి. సూర్యకాంతికి తెలుపుతగ్గి పసిమిరంగు వస్తోంది. ఎటు చూచినా భూమి కనుపించడంలేదు. చేలన్నీ బంగారు మలామా చేసినట్లు మెరుస్తున్నాయి. కొంచెం దూరానికిచూస్తే కరగి ద్రవమైన బంగారపునీటిలో తరంగాలు లేస్తున్నాయా అన్నట్లు, పండి తలలువంచిన వరిచేలను గాలితెరలు కదిలిస్తున్నాయి. ఆకాశంలో నీలిరంగు ఘనీభవించింది. కన్నులకు హాయిని గొలిపే ప్రశాంతమైన ప్రకృతి, చల్లని శీతగాలి, వెచ్చని యెండ మనస్సుకి మైకాన్ని కలుగజేస్తున్నాయి.

మేమిద్దరం యేవో అనవసరమైన మాటలు మాట్లాడుకొంటున్నాం. నవ్వడానికి తగినంత విషయం లేకపోయినా ఒకర్నిచూచి ఒకళ్ళం నవ్వుకొంటున్నాం ముఖాలు ఎరుపెక్కాయి నవ్వుతూంటే కళ్లు నీళ్ళతో నిండుతున్నాయి నడక సాగడంలేదు. చెప్పినమాటలే చెప్పుకోడం, నవ్వుకోడం. ఒకరిముఖం ఒకళ్ళం చూడ్డంతో సిగ్గూ నవ్వూ ముంచెత్తుకొస్తున్నాయి రోజూ చూచుకొనే ముఖాలే. కాని ఆ సమయంలో ఏవేవో మా మనస్సులకందని భావాలు మా ముఖాలమీద చిందులాడుతున్నాయి. కొంతసేపటికి పంటకాలువగట్టుకి చేరాం. దాన్ని దాటడానికి పలుచని తాటిపట్టె ఉంది. ముందు నేను పట్టె ఎక్కాను. దానిమీద నడుస్తూంటే అది కొంచెం క్రిందికీ మీదికీ ఊగుతోంది. ఆవలిగట్టుకి చేరి 'రా' అన్నాను 'నేను రాలేను' అంది. నేను మళ్ళీ యివతలి గట్టుకివచ్చి 'నా చెయ్యి పట్టుకొని, రా' అంటూ ఆమెచెయ్యి పట్టుకోబోయాను. చటాలున వెనక్కి వెళ్ళింది. ఇప్పుడామెలో నవ్వు తగ్గింది. ముఖం ఎర్రగాఉంది. కనురెప్పలు వాలిఉన్నాయి. శరీరం బిగబట్టుకొని, ముఖం ప్రక్కకు తిప్పుకొని నిలుచుంది. "రమ్మంటే వెనక్కి పోతావేం? నీకేమీ భయంలేదు. నేను పట్టుకొంటానుగా! రా!" అని ముందుకి అడుగు వేసి ఆమెచెయ్యి పట్టుకొన్నాను. అతి ప్రయత్నం మీద నావైపొకసారి చూచి "ఊహుఁ! నేను రాలేను" అని చెయ్యి విదిలించుకొని, ముడిచి పెట్టుకొని గొంతుక కూర్చుంది. రెండు చేతులతోనూ ముఖం కప్పుకొంది. "పట్టె దాటకుండానే భయపడతావెందుకు? దాటలేకపోతే మీ పిన్నిగారింటికి వెళ్ళడమెలాగ?" అన్నాను. "పోనీ, వెనక్కిపోదాం అంది. ఇంక అరమైలు ఉంది. ఇంతదూరమూ వచ్చి వెనక్కిపోవడమా? ఛా! నీకు భయంలేకుండా నేను దాటిస్తాను, రా!" అన్నాను.

"ఊహూఁ"

"లేకపోతే కాలువదిగు మహా ఉంటే తొడ లోతు ఉంటుంది. కాళ్లకు బురద అంటుకొంటే మీ పిన్నిగారియింటికి వెళ్లాక కాళ్లు కడుక్కోవచ్చు."

"అవన్నీ ముళ్లమొక్కలు నేను దిగలేను రా! వెనక్కి యింటికిపోదాం" అని లేచింది చేసే దేమీలేక నేను ఆమెవెనుకనే నడవసాగాను. ఇదివరకు యెన్నడూ లేని వింతప్రవర్తన ఆ సమయంలో నాకామెలో గోచరించింది నేను కొంచెం దగ్గరగా నడిస్తే తాను దూరంగా తొలగుతోంది. నాముఖంవైపు చూడ్డంలేదు అడుగులు చురుగ్గా పడుతున్నాయి. కందిమొక్కలు అక్కడి బాట వెడల్పును తగ్గించాయి అందుచేత ఆమె ముందు నేను వెనుక నడుస్తున్నాం. బెదురుబెదురుగా, పరుగిడుతోందా అన్నట్టుగా నడుస్తోంది. "జానకీ! నెమ్మదిగా నడుద్దూ, నీకు పుణ్యముంటుంది" అన్నాను. "ఏం, ఆడదానితో నే నడవలేకపోతున్నావా" అంటూ వెనక్కి చూడకుండా మామూలు గమనం సాగిస్తోంది. నేను రెండు గెంతులు వేసి రెండుచేతులతోనూ ఆమెభుజాలు పట్టుకొని ఆపుచేశాను. చెంపమీద చెయ్యివేసి ముఖాన్ని నావైపుకి తిప్పాను. "ఏయ్ ఏమిటీ పరుగు? నేను పరుగెత్తానంటే నువ్వు వెనకపడిపోయి యేడుస్తూ కూర్చుంటావ్ తెలుసా?" అంటూ ఆమె కళ్ళల్లోకి చూచాను. ఒకసారి నా కళ్ళల్లోకి చూచి కళ్లు మూసేసుకొంది. ఆమె కనుకొలకుల్లోంచి ఆణిముత్యాల్లాగ నీటిబొట్లు జలజల రాలాయి. నల్లగా సుడులు తిరిగిన ముంగురులక్రింద చెమట బిందువులు మెరుస్తున్నాయి చెంపలు చెమ్మగిల్లాయి బిగియపట్టిన పెదిమలు మామిడిచిగుళ్లలాగ మెరుస్తున్నాయి. ఆమె చెంపమీదనున్న నా అరచేతిని ఆమె తలవెనుకభాగమున ఉంచి రెండవచేతితో ఆమె వలెవాటుగా వేసుకొన్న ఆకుపచ్చని సిల్కుకండువాకొంగుతో ముఖంమీది చెమటను తుడిచాను, కళ్లు ఒత్తాను. ఎదుటికి తీసిన కండువాకొంగును అలాగేవదిలి, నా రెండు అరచేతులతోనూ ఆమె చెంపలు అదిమిపట్టి పెదిమలు ముద్దుపెట్టుకొన్నాను. ఆమె చటాలున వెనక్కి తగ్గింది. కండువా క్రిందికి జారిపడింది. ఆనాటివరకూ నేను ఊహించనైనా ఊహించని అపూర్వమైన ఆకర్షణశక్తిని, ఉల్లిపొర వంటి గులాబి రంగు జాకెట్టుతో ఆచ్ఛాదితమైన ఆమె వక్షం చూచాను. నా మనస్సు, కళ్లు ప్రకృతిని మరచాయి. సూదంటురాయిలోని ఆకర్షణశక్తిలాంటి శక్తి ఏదో నన్ను ఆమెవైపుకు లాగింది. నా రొమ్ము పొంగింది. ముందుకు ఒక్క గంతువేసి ఆమెను హృదయానికి గట్టిగా అదుముకొన్నాను. ఆమె రెండుచేతులూ నన్ను పెనవేసుకున్నాయి కళ్లు గట్టిగా మూసుకొని తన చెంపను నా చెంపకు చేర్చింది కొన్నిక్షణాలకు నేను స్మృతికి వచ్చి చేతులతో మెల్లగా ఆమె వీపునిమిరి వదిలిపెట్టాను. ఆమెకండువా పైకితీసుకొని నెమ్మదిగా అడుగులు ముందుకు వేసింది. ఆమె వెనుకనే నేనూ వెళ్లాను. మేము ఇంటికి చేరేసరికి సందెచీకటి వ్యాపించింది.

పదిహేను నిమిషాలు నిశ్శబ్దంగా ఉన్నతరువాత "రామం! నిద్రపోతున్నావా?" అని పలుకరించింది జానకి. నాకు నిద్రనుండి లేపినట్లయింది. ఉలికిపడి 'లేదు' అని కళ్లువిప్పాను. "ఇప్పుడే వస్తాను" అని చెప్పి లోపలికి వెళ్లింది. పదినిమిషాలకి కప్పు చేతితో పట్టుకొని నాదగ్గరకు వచ్చింది వద్దంటే తప్పకుండా తాగిస్తానంటావ్ ఇలా బలవంతాన తాగిస్తే జ్వరం తగ్గుతుందా?" అన్నాను. "గ్లూకోజు యేమీ చెయ్యదు. నీరసం తగ్గిస్తుంది. నీకు నేను చెడుగు చేసేదయిస్తానా?" అని అంటూ కప్పు నానోటిదగ్గరగా తెచ్చింది. కలవరపాటుతో తలప్రక్కకు తిప్పుకొని కప్పు అందుకొని గ్లూకోజు గొంతుకలో పోసుకొని కప్పిచ్చాను. లోపలికి వెళ్లివచ్చి "ఇంకాయేమైనా చదువుదామా?" అంది "ఇంకేమీవద్దు. నువ్వుచదువుకో" అన్నాను. "నాకూ చదవాలనిలేదు. డాక్టరుగారికి కబురుచేస్తాను" అని అంటూ బైటికి నౌకరును పంపింది. పదినిమిషాలకి డాక్టరువచ్చి నన్ను పరీక్షించి 'జ్వరంలేదు. నీరసంగా ఉంటే హార్లిక్స్ గాని, కాఫీగాని త్రాగండి. రేపు అన్నంతినవచ్చు' అని చెప్పివెళ్లిపోయారు.

జానకి నాకు యెదురుగానున్న కుర్చీలో యేదో ధ్యానిస్తూ కూర్చుంది ఆ తరువాత "రామం, నేను చెప్పినప్రకారం మాయింట్లో ఉంటావుకదూ?" అని ప్రశ్నించింది. నేను వెల్లకిలాపడుక్కొని పైకిచూస్తూ "నీకొసందేహ మెందుకు కలిగిం?" దన్నాను "అబ్బే! యేమీ లేదు. నువ్వు ఉంటానని మాటయిస్తే నామనసుకి తృప్తిగా ఉంటుంది...ఉంటావుకదూ?" అని అంటూ

లేచి నామంచానికి దగ్గరగానిలబడి కొంచెంవంగి నా ముఖంలోకి చూచింది. ఉదయించిన సూర్యబింబంలాగ ముఖం ఎర్రగా పొంగిఉంది. ఆలుచిప్పల్లా మెరిసేకళ్లల్లో, నీరు తొణికిసలాడింది. రెండు కన్నీటిబొట్లు నాగుండెమీదపడి నాకొన్నాళ్లలోపల ఇంకిపోయాయి అదేం జానకీ! అకారణంగా కంటతడి పెడతావ్! నేను ఉంటాననీ ఉండననీ యేమీ చెప్పకుండా నే?" మరేమీ మాట్లాడకుండా గిర్రునతిరిగి నా యెదుటినుంచి వెళ్లిపోయింది. తరువాత ఒకగంటవరకూ ఆమె నాగదిలోకి రాలేదు. నేను కళ్లుమూసుకొని ఆ భార్యాభర్తల ఆదరణను పదేపదే తలుచుకొంటున్నాను. నాతో స్నేహంగాని తగినంత బంధుత్వంగాని లేని జానకిభర్త నాయందు చూపే సోదరప్రేమను తలచుకొన్నకొద్దీ నాగుండెలు దడదడలాడసాగాయి. కడుపులో వేదన, మనస్సులో ఆందోళన బయలుదేరాయి మాటిమాటికీ దొర్లుతూ మనస్సు కుదుటపరచుకోడానికి ప్రయత్నించాను. లేచి గదిలో పచారుచేశాను. నీరసంవచ్చి మళ్లీ పరున్నాను. ఒకగంట గడిచాక జానకి, కప్పుతో వచ్చి నా మంచం దగ్గర నిలబడింది. నాముఖం చూడకుండా తలవంచుకొని (హార్లిక్సు) తీసుకో' అంది. మంచంమీదపరున్న కారణంచే నాకు ఆమె ముఖం స్పష్టంగా కనుపిస్తోంది. ముఖం శుష్కించి ఉంది. కళ్లు నీరసంగా నేలను చూస్తున్నాయి. ఈగంట సేపూ యేడ్చిందని ఆమె ముఖం స్పష్టంగా తెలియజేస్తోంది. జ్వరం పూర్తిగా తగ్గిపోయి నాకు నీరసంగా ఉంది. అందుచేత యేదైనా త్రాగడానికి నాకిప్పుడు అభ్యంతరమేమీ లేదు. ఆమె ముఖాన్ని అలాగే పరీక్షిస్తూ కప్పు తీసుకోడానికి లేచి కూర్చున్నాను. చెయ్యి చాచాను. నా దృష్టి అంతా ఆమె ముఖం మీద ఉన్న కారణంచేత, నా వేళ్లు కప్పు పట్టుకోడానికి బదులుగా ఆమె ముంజేతిని పట్టుకొన్నాయి. 'రామం!' అని అగాధమైన నూతిలోనుండి అరచినట్లు, అగ్నిపర్వతంమీది రంధ్రంలోనుండి వచ్చిన ఆవిరి ధ్వనిలాగ, నాభిస్థానమునుండి, ధ్వనికాని అరపు అరచింది. ఆమె చేతిలోని కప్పు క్రిందపడి ఠంగ్‌మని ధ్వనిచేసి బ్రద్దలైంది. తన రెండు చేతులతోను చప్పుడయేటంతగా ముఖం చరచుకొని గట్టిగా మూసుకొంది. నీరసంతో స్పృహ తప్పినవానిలా నేను మంచంమీద వాలాను. ఆమె గది నుండి బయటకు యెప్పుడు వెళ్ళిందో నేను యెరుగను.

తరువాత ఒకగంట గడిచి ఉంటుంది. గదిలో బూటు చప్పుడై నాకు మెలకువ వచ్చింది. "ఎలాఉందోయ్!" అని అంటూ బట్టలైనా మార్చుకుండా జానకి భర్త నా దగ్గరకు వచ్చి చేతిలోని బత్తాయిలు బల్లమీద పెట్టి నా వంటిమీద చెయ్యివేసి చూచాడు "జ్వరం తగ్గిపోయింది; జానకి యేదీ?" అని 'జానకీ!' అని పిలిచాడు. 'వస్తున్నా' అంటూ జానకి ఫ్లాస్కూ కప్పూ చేతిలో పట్టుకొని వచ్చింది. తొందరగా కప్పులో హార్లిక్సు పోసి నా మంచం దగ్గరకు వచ్చింది. 'హార్లిక్సు తీసుకోవోయ్' అని అంటూ అతను నన్ను లేవదీయబోయాడు. లేచి కూర్చున్నాను జానకి చేతిలోని హార్లిక్సు తీసుకొని త్రాగాను "ఇతన్నొకణ్ణీ వదిలేసి లోపలేం చేస్తున్నావ్? ఇంతకు ముందు యేమైనా త్రాగడానికి యిచ్చావా?" అని ఆమెను ప్రశ్నించాడు. "ఆఁ, ఆఁ త్రాగాను. ఒకసారి గ్లూకోజు ఒకసారి హార్లిక్సు త్రాగాను "అని నేను జవాబుచెప్పాను. "మాట నీరసంగా వస్తోందే!" అంటూ బల్లమీద నున్న బత్తాయి వలిచి "ఈ బత్తాయి తొనలు తిను, నీరసం తగ్గుతుంది" అంటూ ఒలిచినపండు నా చేతిలో పెట్టాడు. జానకి క్రింద నున్న తొక్కలు యేరి తీసుకొని పోయింది. ఆమె తొక్కలు యేరేటప్పుడు నాగుండె దడదడ లాడింది. క్రిందికి చూచాను. అక్కడ యేమీ లేదు. పగిలిన కప్పు ముక్కలు యెప్పుడు యెవరు తీసినదీ నాకు తెలియదు.

ఒక నిమిషానికి జానకి తిరిగివచ్చి పళ్లెం ఒకటి నాకు దగ్గరగా క్రింద పెట్టింది. అతను 'తినవోయ్ తొనలు' అని అంటూ లేచి లోపలికి వెళ్లాడు. నేను పండు విడతీసి రెండు మూడు తొనలు చప్పరించి పళ్లెంలో పడేశాను.

అతని ఆదరణ చూస్తుంటే నాకు మాటిమాటికీ సూర్యం తలపుకు వస్తున్నాడు. నా బాగుకోసం తన సర్వశక్తుల్నీ ధారపోసి చివరికి నాకు అమూల్యమైన ఉపదేశాన్నిచ్చి, నా అభివృద్ధినే కోరుతూ కన్నుమూశాడు సూర్యం. వాడు నన్నువిడిచిపోయాక, రెక్కలు తెగిన పక్షిలా యీ పట్నంలో పడి ఉండగా మళ్ళీ నేటికి నా సూర్యమే జానకి భర్త రూపంలో నాకై తపిస్తున్నాడా! అనిపించింది నాకు—చిన్నప్పుడు నాకు ప్రపంచ జ్ఞానంలేని వయస్సులో మా అమ్మ నాకోసం యేమి బాధపడిందో

నేను సరిగా యెరుగను. ఆమె ఉన్నప్పుడు మా నాన్న తామరాకుమీది నీటిబొట్టులా నన్ను గాని మా అమ్మను గాని అంటీ ముట్టకుండా ఉండేవాడు; మతి భ్రమించినట్టు తిరుగుతూండేవాడు, యేవేవో జపతపాల్లో నిమగ్నుడై ఉండేవాడు. మా అమ్మపోయినతరువాత దారంతెగిన గాలిపటంలా స్వేచ్ఛగా దేశాంతర్గతుడయాడు. పిమ్మట 'సూర్యం' మూడుసంవత్సరాలు మా అమ్మను నాన్నను మరిపించాడు తరువాత నన్ను దుఃఖసముద్రంలో పడేసిపోయాడు. నేటికి జానకిభర్త సముద్రగర్భంలో కొట్టుకొంటూన్న నన్ను, నావికునిలా దరికి చేర్చాలని ప్రయత్నిస్తున్నాడా!—అని తోచింది నాకు.

ఆరాత్రి నాకు నిద్రపట్టలేదనే చెప్పాలి. రాత్రి పదకొండుగంటలవరకూ భార్యాభర్తలిద్దరూ నా గదిలోనే కూర్చున్నారు. అతను టైప్ చేసిన రెండు అప్లికేషన్లు నా చేతి కిచ్చి సంతకంచెయ్యమన్నాడు. ఒకటి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కి, రెండోది కలెక్టరుకి. ఇంకేమీ చదవకుండా సంతకాలు చేసి కాగితాలు తిరిగి యిచ్చాను. వారు రెండుసార్లు గ్లూకోజు ఒకసారి హార్లిక్స్ నా చేత త్రాగించారు. సాయంకాలం నేను తినకుండా విడిచిన బత్తాయి తొనలు నా చేత తినిపించారు. నా కోసం వారి నిద్ర చెడుతుందని తలచి నిద్ర పోయినట్లు కళ్లు మూసుకొని పడుకున్నాను. తరువాత అతను పలుకరించినా నేను మాట్లాడలేదు. నేను నిద్ర పోయాననే తృప్తిపడి అతను నా గదిలోనే తనకోసం వేయబడిన మంచంమీద పడుకున్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది. నేను మంచం మీద దొర్లుతూ రాత్రిగడిపాను. చీకటితోనే లేచి అతను నా మంచం దగ్గరకు వచ్చి 'ఏమోయ్! మెలకువ వచ్చిందా?' అన్నాడు, 'ఆఁ' అన్నాను. 'అప్పుడేలేవకు, ఇంకా సరిగా వెల్తురు రాలేదు, పడుకో' అని చెప్పి లోపలికి వెళ్ళాడు. ఆ తరువాత నాకు నిద్రపట్టి యెనిమిదింటికి మెలకువ వచ్చింది. తరువాత డాక్టరు వచ్చి చూచి అన్నం పెట్ట వచ్చునని చెప్పారు. ఆరోజున పది గంటలకు నాకు అన్నం పెట్టించి అతను ఆఫీసుకి వెళ్ళాడు. తరువాత జానకి గజేంద్రమోక్షంలోని పద్యాలు ముహుర్ముహురంగా చదివి వినిపించింది.

ఆతరువాత 'రామం! నిన్న నామాటకు జవాబు చెప్పలేదు నీకు కాస్త అన్నం వండిపెట్టుకోడానికైనా తగనా?' అంది. 'నువ్వు అలా యెప్పుడూ అనుకోవద్దు. నీచేతి అన్నంతినే అదృష్టం నాకీనాటికి కలిగినందుకు సంతోషిస్తున్నాను. నేనీ పట్నంలో ఉంటే తప్పకుండా ఇక్కడే ఉంటా' అన్నాను.

'ఉండక ఎక్కడికి వెడతావు? నేడో రేపో నీకు స్థిరమైన ఉద్యోగం యీపట్నంలోనే దొరికే యేర్పాటు జరుగుతూంటేను?'

'ఉద్యోగం దొరికితే యెక్కడికి పోతాను?' అన్నాను.

ఆమె యేదో కొంత తృప్తిపడిందనుకొంటాను. ఇంక మాట్లాడలేదు. తరువాత రెండున్నరవరకూ రేడియో ప్రోగ్రాములు సాగాయి. జానకిలోపలికి వెళ్ళి హార్లిక్సు తెచ్చింది. నిన్నటి సంఘటన తలపుకు వచ్చి గుండె దడదడ లాడింది. ఆమె నిశ్చలంగా కప్పు నాకు అందిచ్చింది. కొంచెం వణకుతూన్న చేతులతో కప్పు తీసుకొని త్రాగాను. ఆమె నౌకరు కుర్రవాణ్ని పిలిచి వీడు 'సినీమాపాటలు బాగా పాడతాడు వింటావా?' అంది. 'అలాగా! పాడరా!' అన్నాను. వాడు అరగంటసేపు పాడి కాలక్షేపం చేశాడు. తరువాత ఆమె లోపలికి వెళ్లింది. నేను పుస్తకాలూ, పత్రికలూ తిరగేస్తూ కష్టంతో నాలుగు గంటలు దాటించాను. ఏదోవిధంగా ఆరాత్రి గడిచింది. మరునాడు ఉదయం నేను దుకాణంమీదకు వెడతానని బయలుదేరాను. వారిద్దరూ "ఇప్పుడే యేమంత మించిపోయింది; రెండురోజులు విశ్రాంతి తీసుకొన్నాక వెళ్లకూడదా?" అన్నారు. "కాదు తప్పక వెళ్లాలి నావల్ల కావలసిన అర్జంటుపనులున్నాయి" అని చెప్పి దుకాణంమీదకు వెళ్లాను. వెళ్లగానే మా షావుకారును కలుసుకొని నాకు ఆరోగ్యం బాగులేదు, కొంతకాలం మా గ్రామంపోయి విశ్రాంతి తీసుకోవాలి శలవు యిప్పించమని కోరాను. ఆయన వెళ్లవద్దని అనేకవిధాల చెప్పాడు. "క్షమించండి. నాకు నౌకరీ చెయ్యాలని కూడా లేదు" అని చెప్పి ఆసాయంకాలం నాలుగు గంటలవరకు నావల్లకావలసిన వ్రాతకోతలు మొదలైన పనులన్నీ చక్కబెట్టి సాయంకాలం మా ఊరికి బస్సు ఎక్కాను.